## తిరుమల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం...

తిరుమల,తిరుమల శ్రీవారి ఆలయంలో సాలకట్ల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 24 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఇందులో భాగంగా శ్రీవారి తరఫున సేనాధిపతి అయిన శ్రీ విష్వక్సేనుల వారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అంకురార్పణ కార్యక్రమాల్లో భాగంగా ఆలయంలోని యాగశాలలో భూమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుట్టమన్నులో నవధాన్యాలను నాటారు. వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తిరుమలలోని పలు ప్రాంతాలను విద్యుద్దీపాల అలంకరణలతో కళ్లుమిరిమిట్లు- గొలిపేలా తీర్చిదిద్దారు. పూల అలంకరణలు ప్రత్యేక ఆకర్శణగా నిలిచాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలను నేరుగా తిలకించేందుకు భక్తులు భారీగా చేరుకుంటున్నారు.

# అగ్రనేత


తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి సంపుటి: 10 సంచిక :183 ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ తేది: గురువారం 25-09-2025 పేజీలు:4 వెల: 2.00


## హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు




హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్ రావు నిప్పులు చెరిగారు. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు అని హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాల వాటపై సీఎం రేవంత్ రెడ్డి ఒక మాట, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరో మాట మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో పూట పూటకో మాట, ఘడియ ఘడియకో లెక్క ఉందన్నారు. 299 టీఎంసీ కృష్ణా జలాల్లో వాటా ఒప్పుకొని తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీనే. చారిత్రక తప్పిదం చేసింది మీరు, తెలంగాణ సాగు నీటి రంగం చరిత్రలో ద్రోహులు మీరు. సమ్మక్క సాగర్ పూర్తి చేసింది బీఆర్ఎస్, డబ్బా ప్రచారం చేసుకుంటున్నది కాంగ్రెస్. ఒకవైపు చంద్రబాబుకు భయపడి బనకచర్లపై మౌనం వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఉందని ఆలమట్టి ఎత్తుపై మౌనం వహిస్తున్నారు.

### సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే, పక్క రాష్ట్ర ప్రయోజనలే ఎక్కువా?

రేవంత్ రెడ్డికి సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే, పక్క రాష్ట్ర ప్రయోజనలే ఎక్కువా? కృష్ణా జలాల్లో వాటా విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మల్లా పాత పాటే పాడిండు. ఉత్తర కుమార ప్రగల్భాలే పలికిండు. బేసిన్ల గురించి బేసిక్స్ తెల్వదు, నీళ్ల వాటా గురించి నీళ్లు నములుతారు. కనీస అవగాహన లేని, తెలంగాణ సోయి లేని ఇట్లాంటి దద్దమ్మలు మనకు ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి కావడం మన దౌర్భాగ్యం. ఉత్తం కుమార్ రెడ్డి నిన్న ఏం మాట్లాడిండు.. కృష్ణా జలాల్లో 763 టీఎంసీలు ఇవ్వాలని డిమాండ్ చేసినం అని గొప్పగ చెప్పిండు. రైట్ షేర్ కోసం నేనే స్వయంగా ట్రిబ్యునల్ ముందు అటెండ్ అయినట్లు చెప్పుకున్నడు అని హరీశ్‌రావు గుర్తు చేశారు.

### పూటకో మాట మాట్లాడి పరువు తీసుకుంటున్నరు..

మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18.06.2025 నాడు ఏమన్నడు కృష్ణా బేసిన్ మీద 500 టిఎంసీలకు బ్లాంకెట్ ఎన్‌వోసీ ఇవ్వండి, ఆ తర్వాత ఏ ప్రాజెక్టులైన కట్టుకోండి అన్నడు. మొన్న సెప్టెంబర్ 13న జరిగిన నీటి పారుదల శాఖ సమీక్షలో ఇదే ముఖ్యమంత్రి ఏమంటడు.. కృష్ణా జలాల్లో 904 టీఎంసీల వాటా సాధించి తీరాలె అంటడు. ఉత్తం ఏమో 763 టిఎంసీల రైట్ షేర్ అంటడు, ముఖ్యమంత్రి ఏమో ఓ సారి 500 టీఎంసీ అంటడు. ఓసారి 904 టీఎంసీలు అంటడు. పూటకో మాట మాట్లాడి పరువు తీసుకుంటున్నరు. వీళ్ల అజ్ఞానం వల్ల తెలంగాణ రాష్ట్రం హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోయే పరిస్థితి ఉంది. ముఖ్యమంత్రి చెప్పింది కరెక్టా? లేదా నీళ్ల మంత్రి చెప్పింది కరెక్టా? అసలు ఎవరిది కరెక్టు? కనీస అవగాహన లేకుండా ఎట్ల మాట్లాడుతున్నరు. కనీసం ప్రిపరేషన్ లేకుండా ఇలా ఎన్నాళ్లు ఉంటారు అని హరీశ్‌రావు నిలదీశారు.

### నిర్విరామ పోరాటం చేసి సెక్షన్ 3 సాధించారు కేసీఆర్..

కేసీఆర్ కృష్ణా జలాల్లో రైట్ ఫుల్ షేర్ సాధించేందుకు సెక్షన్ 3 కోసం పోరాటం చేసారు. ఉమా భారతి, గడ్కరీ, షకావత్, ప్రధానిలను కలిసారు. సుప్రీం కోర్టు గడప తొక్కి, నిర్విరామ పోరాటం చేసి సెక్షన్ 3 సాధించారు. 763 టీఎంసీలు అనేది కేసీఆర్ పట్టుబట్టిన విషయం. ఇప్పుడు తామేదో కొత్తగా 763 టీఎంసీలు డిమాండ్ చేసినట్లు.. డబ్బా కొడుతున్నడు ఉత్తం. అదనపు టిఓఆర్ ప్రకారం, మేము కృష్ణా జలాల్లో మొత్తం 935 టీఎంసీల వాటా సాధించేందుకు గ్రౌండ్ తయారు చేసినం. 811 టీఎంసీలు, 195 సర్ ప్లస్ వాటర్ షేర్, 45 టీఎంసీల పోలవరం వాటర్. ఇప్పుడు వీళ్లు ఏం అంటున్నరు 904 టీఎంసీలే మా న్యాయమైన వాటా అంటున్నరు. ఒక బాధ్యత లేదు, రాష్ట్రం మీద ప్రేమ లేదు. నీటి ప్రయోజనాల మీద పట్టు లేదు. ద్రోహం చేసినోల్లే సుద్దులు చెబుతున్నారు. 299:512 ద్రోహం చేసిందే కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడు సిగ్గులేకుండా అబద్ధాలు మాట్లాడుతున్నారు. ఉత్తం ఏమంటారు.. 512:299 నీటి వాటాను బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చిందట. చారిత్రక అన్యాయాన్ని సరి చేస్తున్నరట. ఛీ నోరు తెరిస్తే పచ్చి అబద్దాలు. ముఖ్యమంత్రి అంతే, నీళ్ల మంత్రి కూడా అంతే. 299:512 హక్కుల విషయంలో మేం సంతకం పెట్టినం అని నిరూపిస్తే నేను పదవికి రాజీనామా చేస్తా, లేదంటే నువ్వు చేస్తవా ఉత్తం? అని హరీశ్‌రావు సవాల్ విసిరారు.

### తెలంగాణకు తీరని చారిత్రక ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ

కృష్ణాలో 299:512 వాటా ఇచ్చి, తెలంగాణకు తీరని చారిత్రక ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ. 18.10.2013 నాడు ఉమ్మడి ఏపీ జస్టిస్ శ్రీ కృష్ణ కమిటికి రిపోర్టు ఇచ్చింది. ఇదే రిపోర్టును శాసనసభలోనూ పెట్టారు. తెలంగాణకు కృష్ణాలో 299, ఏపీకి 512 ఇచ్చినం అని అందులో క్లియర్‌గా ఉంటుంది. తెలంగాణ ప్రాంత హక్కులకు ఉమ్మడి రాష్ట్రంలోనే మరణ శాసనం రాసింది కాంగ్రెస్ పార్టీ. మీ చేతగాని తనం, అడుగులకు మడుగులొత్తడం వల్ల 299 వాటా పరిమితం అయ్యింది. అడ్ హక్కు, ఫైనల్ అవార్డుకు తేడా తెలియని అజ్ఞానులు రేవంత్ రెడ్డి, ఉత్తంలు. 2015 జున్ 26లో చేసుకున్న అగ్రిమెంట్ తాత్కాలిక ఒప్పందం అని లేఖలో స్పష్టంగా ఉంది. మీ ముద్దుల అడ్వైజర్ ఆదిత్యానాథ్ కూడా సంతకం పెట్టిండు. ఆయనే ఇప్పుడు మీ అడ్వైజర్. కానీ ఉత్తం ఏమంటడు, బిఆర్ఎస్ పెట్టింది అంటడు. జులై 14, 2014 నాడు కృష్ణాలో 299 అన్యాయం అని కేంద్రానికి లేఖ రాసినం. రాష్ట్రం వచ్చిన 42 రోజుల్లోనే.. ఆనాటి కాంగ్రెస్ మాకు అన్యాయం చేసింది, కొత్త ట్రిబ్యునల్ వేసి నదీ పరివాహక ప్రాంతం ఆధారంగా కేంద్రాన్ని కోరామని హరీశ్‌రావు గుర్తు చేశారు.

## యూఎన్‌లో మళ్లీ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించిన టర్కీ అధ్యక్షుడు

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో టర్కీ అధ్యక్షుడుతయిప్ ఎర్దగోన్ తన ప్రసంగంలో కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించారు. ఇటీవల భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, అయితే ఆ రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ జరగడం సంతోషకరంగా ఉందన్నట్లుగా ఆయన పేర్కొన్నారు. కౌంటర్ టెర్రరిజం అంశంలో భారత్, పాక్ దేశాల మధ్య సహకారం కీలకమైందన్నారు. కశ్మీర్ ప్రజల క్షేమం కోసం ఐక్యరాజ్యసమితి తీర్మానాల ప్రకారం కశ్మీర్ సమస్యను పరిష్కరించాలని, చర్చల ద్వారా ఆ పని జరగాలని ఎర్దగోన్ అభిప్రాయపడ్డారు.

### దక్షిణాసియాలో శాంతి, స్థిరత్వం ఉండాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

గత ఏప్రిల్‌లో పాకిస్థాన్, భారత్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని, దీని వల్ల తీవ్ర సంక్షోభ పరిస్థితులు తలెత్తాయని ఎర్దగోన్ అన్నారు. యూఎన్ జనరల్ అసెంబ్లీ 80వ సెషన్ సందర్భంగా జరిగిన జనరల్ డిబేట్‌లో పాల్గొని మాట్లాడారు. ఇటీవల టర్కీ అధ్యక్షుడు పలుమార్లు కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ దేశాల ముందు ప్రస్తావించారు. గతంలో కూడా యూఎన్ జనరల్ అసెంబ్లీ



సమావేశాల్లోనూ కశ్మీర్ అంశం గురించి ఆయన మాట్లాడారు. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా మే 7వ తేదీన భారత్ ఆపరేషన్ సింధూర్ చేపట్టిన విషయం తెలిసిందే. పాక్‌లో ఉన్న ఉగ్రస్థావరాలను భారతీయ రక్షణ దళాలు ధ్వంసం చేశాయి. మే 10వ తేదీ వరకు పాకిస్థాన్‌పై ఇండియా తీవ్రంగా అటాక్ చేసింది.

## అస్తిత్వ సంక్షోభంలో హిమాలయన్ రాష్ట్రాలు.. కీలక వ్యాఖ్యలు చేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఈ ఏడాది రుతుపవనాలు హిమాలయన్ రాష్ట్రాల లో అల్లకల్లోలం సృష్టించాయి. అతివృష్టి, వరదలు పోటెత్తడం, కొండచరియలు విరిగిపడటం లాంటి కారణాలతో హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలో ఊళ్లకు ఊళ్లే కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న హిమాలయన్ పర్యావరణ వ్యవస్థ పై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. హిమాలయాల ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలు తీవ్రమైన అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని వ్యాఖ్యానించింది. పర్యాటకం కోసం, నిర్మాణాల కోసం, మైనింగ్ కోసం పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారని, పర్యాటకాన్ని, నిర్మాణాలను, గనుల తవ్వకాలను నియంత్రించడం కోసం హిమాచల్‌ప్రదేశ్ అవలంభిస్తున్న విధానాలపై సర్వోన్నత న్యాయస్థానం పలు ప్రశ్నలు సంధించింది. ఈ ఏడాది రుతుపవనాలు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో బీభత్సం సృష్టించాయి. క్లౌడ్‌బరస్ట్‌లు, వరదలు, కొండచరియలు విరిగిపడటం లాంటి ఘటనలతో రెండు రాష్ట్రాలు ఉక్కిరిబిక్కిరయ్యాయి. ఆ రెండు రాష్ట్రాల్లోని పలు పట్టణాలు, గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. హిమాచల్‌ప్రదేశ్‌లో అయితే ఏకంగా ఊళ్లకే ఊళ్లే కొట్టుకుపోయాయి. ఈ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు హిమాలయన్ రాష్ట్రాలన్నీ అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయని వ్యాఖ్యానించింది.'ఈ వర్షాకాలం హిమాచల్‌ప్రదేశ్ పర్యావరణ వ్యవస్థను విధ్వంసం చేసింది. వివిధ ప్రాంతాల్లో కురిసిన వర్షాలు, పోటెత్తిన వరదలు తీవ్రంగా ఆస్తి, ప్రాణ నష్టం కలిగించాయి. వరదల్లో అక్కడి శాశ్వత నిర్మాణాలు, తాత్కాలిక భవనాలు, పెద్ద సంఖ్యలో ఇళ్లు కొట్టుకుపోయాయి. కొండచరియల కింద పలు ప్రాంతాలు నలిగిపోయాయి. హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు హిమాలయన్ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలు తీవ్రమైన అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి' అని సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. హిమాచల్‌ప్రదేశ్‌లోని దుర్బలమైన పర్యావరణ పరిస్థితుల గురించి సవివరంగా కోర్టుకు తెలియజేయాలని ఆదేశించింది. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో భూకంపాలు, కొండచరియలు విరిగిపడటం, అడవుల నరికివేత, పరిహార అటవీకరణ, రహదారుల నిర్మాణం, జలవిద్యుత్ ప్రాజెక్టులు, మైనింగ్ ప్రాజెక్టులు, పర్యాటకానికి సంబంధించి పలు ప్రశ్నలు సంధించింది. మళ్లీ విచారణ జరిగే నాటికి సమగ్ర వివరాలను తెలియజేయాలని ఆదేశిస్తూ.. తదపరి విచారణను అక్టోబర్ 28కి వాయిదావేసింది.

## బెట్టింగ్ యాప్స్ కేసులో తెలంగాణ సీఐడీ కీలక ఆపరేషన్

హైదరాబాద్ : బెట్టింగ్ యాప్స్ కేసులో తెలంగాణ సీఐడీ సోదాలు, అరెస్టులతో ముందుకెలుతుంది. గుజరాత్, రాజస్థాన్, పంజాబ్ రాష్ట్రాల్లోని ఆరు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించి 8 మందిని అరెస్టు చేసింది. వీరంతా 6 బెట్టింగ్ యాప్‌లను నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తాజ్ 007, ఫెయిర్‌ప్లే లైవ్, ఆంధ్ర 365, వీఎల్ బుక్, తెలుగు 365, యస్ 365 బెట్టింగ్ యాప్‌లను ఈ ముఠా నిర్వహిస్తున్నట్లుగా గుర్తించారు. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్ నిర్వాహకులు భారీగా ఆన్ లైన్ మోసాలకు పాల్పడి రూ.వేల కోట్లను దేశం దాటించారని..యాప్స్‌ను ప్రమోట్ చేసే సెలబ్రిటీలు, ఇన్‌ఫ్లూయెన్సర్లు, యూట్యూబర్లకు హవాలా మార్గాల్లో రెమ్యూనరేషన్ చెల్లించారనే ఆరోపణలతో పలు కేసులు నమోదయ్యాయి. 25 మందిపై మియాపూర్, పంజాగుట్ట పోలీసులు కేసులు నమోదు చేశారు. తెలంగాణ వ్యాప్తంగా పలుచోట్ల కేసులు నమోదయ్యాయి. ఈ కేసులన్నింటిని తెలంగాణ ప్రభుత్వం సీఐడీకి అప్పగించిన తర్వాతా దర్యాప్తు ముమ్మరం చేసింది. బెట్టింగ్ యాప్స్ కేసులో విచారణ నోటీసులు అందుకున్న వారిలో దగ్గుబాటి రాణా, ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాత్, అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందర రాజన్, వాసంతి కృష్ణన్, శోభశెట్టి, అమృత చౌదరి, నాయని పావని, నేహ పఠాన్, పండు, పద్మావతి,ఇమ్రాన్ ఖాన్, విష్ణుప్రియ, హర్షసాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతు చౌదరి, బండారు శేషాయనీ సుప్రీత ఉన్నారు. వారిలో చాలమంది ఇప్పటికే విచారణకు హాజరయ్యారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్ ఫామ్స్ పై డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) ఓవైపు నిషేధ కొరఢా ఝుళిపించింది. ఆన్ లైన్ గేమింగ్ నిర్వహిస్తున్న 357 వెబ్ సైట్లు, యూఆర్ఎల్ లను బ్లాక్ చేసింది. సుమారు 700 ఆఫ్ షోర్ సంస్థలపైనా ప్రస్తుతం డీజీజీఐ నిఘా పెట్టింది. గేమింగ్ సంస్థలకు చెందిన 2,400 బ్యాంక్ ఖాతాలు సీజ్ చేసి 140కోట్ల మేరకు సీజ్ చేసింది. కోట్లను ఫ్రీజ్ చేసింది.




## హైకోర్టుకు సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ ..



హైదరాబాద్,సీనియర్ ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కాళేశ్వరం పై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను క్వాష్ చేయాలని తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తనకు వివరణ ఇచ్చే అవకాశం ఇవ్వలేదని ఆమె పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ మేరకు కమిషన్ రిపోర్టులో తన పేరు తొలగించాలన్నారు. పీసీ ఘోష్ కమిటీ రిపోర్టును క్వాష్ చేయాలని కోరారు.సీనియర్ ఐఏఎస్ స్మితా సబర్వాల్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను క్వాష్ చేయాలని హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ 665 పేజీల రిపోర్టులో తనపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేసిన కమిషన్.. తన వివరణ తీసుకోలేదని పిటిషన్ లో ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు పీసీ ఘోష్ కమిటీ రిపోర్టును క్వాష్ చేయాలని కోరారు. అలాగే ఈ రిపోర్టు ఆధారంగా తనపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరినట్లు సమాచారం.ఇక మాజీ సీఎం కేసీఆర్ హయాంలో ఈ కాళేశ్వరం ప్రాజెక్ట్ ను నిర్మించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రాజెక్టులో అక్రమాలు, లోపాలు ఉన్నాయని సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి పీసీ ఘోష్ అధ్యక్షతన కమిషన్ ఏర్పాటు చేసింది. ఈ కమిషన్ అగస్టు 2025 లో రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. ఇటీవల అసెంబ్లీలో కూడా కమిషన్ ఇచ్చిన రిపోర్టు గురించి సీఎం ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పటికే ఈ వ్యవహారంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషీ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా ఆయనకు ఊరట లభించింది. ఈ నేపథ్యంలో తాజాగా స్మితా సబర్వాల్ సైతం న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిందే

హైదరాబాద్ : బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాల్సిందేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌తో కలిసి ఎమ్మెల్సీ మధుసూదనాచారి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల విశ్వాస ఘాతుకానికి పాల్పడుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు స్పష్టమైన అవకాశాలు ఉన్నా వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం నీరు గారుస్తుంది. దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కుల గణన చేపట్టిన దాఖలాలు లేవు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయకుండా కాంగ్రెస్ మోసం చేస్తుంది. కేసీఆర్ ఆదేశాలతో తమిళనాడులో బీసీ చట్ట బద్ధత ఎలా కల్పించారో అక్కడ పర్యటించి తెలుసుకున్నాం. ఆ విషయాలు ఈ ప్రభుత్వానికి చెప్పినా పెడ చెవిన పెట్టింది. బీసీ బిల్లు పెట్టాక సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి అనేక సార్లు పోయినా దీనిపై మాట్లాడలేదు. రాహుల్ గాంధీ దీనిపై ఎందుకు స్పందించడం లేదు. మా మనసు గాయపడితే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయి. 42 శాతం రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెల్సీ మధుసూదనాచారి డిమాండ్ చేశారు. అనంతరం మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం. మీరు జీవో ఇవ్వకుండానే కొందరు కోర్టుని ఆశ్రయించారు. ఇప్పుడూ ప్రభుత్వం ఏం చేస్తుంది. కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ లేదు.. రాష్ట్రంలో బీసీలకు మంత్రి పదవులు కేటాయించలేదు. కేంద్రంపై ఒత్తిడి తీసుకురావడంలో రేవంత్ ప్రభుత్వం విఫలం బీజేపీ ఎంపీలు




నోరు విప్పరు. కేవలం కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ బీసీల తరపున పోరాడుతుందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. 42శాతం జీవో ద్వారా ఎన్నికలు నిర్వహిస్తాం అంటున్నారు. మరి 22 నెలలల్లో జీవో ఎందుకు ఇవ్వలేదు. దేశంలో బీసీ రిజర్వేషన్ల సాధించిన రాష్ట్రం తమిళనాడు. మిగతా రాష్ట్రాలు ఎందుకు విఫలం అయ్యాయో అసెంబ్లీలో మేము వివరించాము. మీరు జీవో ఇవ్వకుండానే కొందరు కోర్టుకు వెళ్లడం కాంగ్రెస్ కుట్రనే. అఖిల పక్షాన్ని ప్రధాని వద్దకు తీసుకెళ్లి తేల్చుకోవాలి. బీసీ రిజర్వేషన్ల సాధించే వరకు ఢిల్లీ వదిలేది లేదు అని పోరాడాలి. రేవంత్ సర్కార్ బీసీ రిజర్వేషన్లు అనే పులిపై స్వారీ చేస్తున్నారని చెప్పాం. మాట తప్పితే తీవ్ర పరిణామాలు తప్పవు అని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ హెచ్చరించారు.

## కేసీఆర్ మాదిరి మేం చీడ పనులు చేయం



హైదరాబాద్,తెలంగాణ జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. మాజీ సీఎం బీఆర్ ఎస్ అధినేత కేసీఆర్‌పై విమర్శలు గుప్పించారు. ఆయన హయాంలో తెలంగాణను భ్రష్టు పట్టించారని.. పొరుగు రాష్ట్ర ముఖ్యమం త్రి(జగన్-కానీ పేరు చెప్పలేదు)తో చేతులు కలిపి.. నీటిని ధారదత్తం చేసే ప్రయత్నం చేశారని అన్నారు. అదేవిధంగా తెలంగాణను అన్ని విధాలా నాశనం చేశారని.. చీడ పనులు చేసి.. రాష్ట్రాన్నికొల్లగొట్టారని అన్నారు. కానీ, తమ ప్రభుత్వం అలాంటి చీడపనులు చేయబోదని వ్యాఖ్యానించారు.తాజాగా మంగళవారం ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఢిల్లీలో మాట్లాడుతూ.. కృష్ణానది జలాల వివాదంపై స్పందిం చారు. చుక్కనీటిని కూడా తాము వదులుకునేది లేదన్నారు. ఏపీ అవసరాలని చెబుతున్నారు. ఈ అవసరాలు మాకు లేవా? మాదగ్గర రైతులు లేరా? మా దగ్గర పంటలు పండాల్నా వద్దా? అని ప్రశ్నించా రు. అంతేకాదు.. లేనిపోని విజన్‌లు మాకు అవసరం లేదంటూ.. ఏపీ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పరోక్షంగా ఆయన బనకచర్ల ప్రాజెక్టుపై విమర్శలు చేశారు.అందురూ తెలుగు వారే. కానీ, మాకు అవసరం ఉండదా? అని ప్రశ్నించారు. తెలుగు వారేనని.. మా నీళ్లు వాడుకుంటామంటే ఎందుకు ఊరుకుంటామని ప్రశ్నించారు."న్యాయంగా, ధర్మంగా.. మాకు రావాల్సిన నీటిని మేం వాడుకుంటాం. ఈ విషయంపై బలంగా వాదనలు వినిపిస్తాం. అంతేకానీ.. కేసీఆర్ మాదిరి లాలూచీ పడి.. చీకటి ఒప్పందాలు చేసుకుని తెలంగాణ సమాజాన్ని ఏమార్చేది లేదు. అని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. కృష్ణా ట్రిబ్యునల్‌లో రాష్ట్రం తరఫున సమర్థమైన వాదనలు వినిపిస్తామన్నారు. ఇదిలావుంటే, మంగళవారం నుంచి 3 రోజులపాటు కృష్ణా ట్రిబ్యునల్‌లో వాదనలు కొనసాగనున్నాయి. ఇప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గానే లెక్కించి కృష్ణాజలాలను పంపిణీ చేశారు. దీంతో తమకు అన్యాయం జరుగుతోందని, రాష్ట్రం ఏర్పడ్డాక తమ ఆయకట్టు పెరిగిందని తెలంగాణ ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలోకృష్ణా జలాలను తిరిగి లెక్కించి.. న్యాయమైన వాటాను తమకు కేటాయించాలని కోరుతోంది. ఈ నేపథ్యంలో నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే వాదనలకు ప్రాధాన్యం సంతరించుకుంది.

**సంపాదకీయం**

**గురువారం 25-09-2025**

# విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు?

భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవలసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థారులాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొచ్చినప్పుడు ఆ అభ్యర్ధనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు. ఇప్పుడు ఐడిబిఐ బ్యాంక్ (ఇండిస్టియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఒక విదేశీ ప్రైవేటు సంస్థకు అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ రంగ సంస్థగా ప్రత్యేకంగా పరిగణించబడకపోయినప్పటికీ, దానిలోని మెజారిటీ వాటాదారుడిగా ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న ఎల్ఐసి సంస్థ 2019 నుంచీ ఉంది. అందుచేత ఈ విషయమై ఎన్ని అభ్యంతరాలు వెలువడుతున్నప్పటికీ, విదేశీ సంస్థలు మన దేశీయ బ్యాంకుల మీద పెత్తనం పొందడానికి అనుమతించేందుకు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా మొగ్గు చూపుతోంది. ఎందుకు ఈ విధంగా జరుగుతోందన్న విషయాన్ని ఇంతవరకూ వివరించే ప్రయత్నం ప్రభుత్వం గాని రిజర్వు బ్యాంక్ గాని చేయలేదు. సాధారణంగా ఇటువంటి ప్రధాన, విధానపరమైన మార్పులు చేపట్టినప్పుడు 'విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం' అంటూ సాకులు చెప్తారు. కాని ఈ సారి అటువంటిది కూడా లేదు. ఐతే, అటువంటి సాకు ఈ విషయంలో నిలబడదు. విదేశీ సంస్థలు మన బ్యాంకుల వాటాలను కొనుగోలు చేస్తే వచ్చే మొత్తమే చాలా తక్కువ. కేథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను కొనుగోలు చేసిన ఫెయిర్ ఫాక్స్ సంస్థ చెల్లించినది కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. పైగా, జూన్ 2024లో తమ వాటాల్లో కేవలం 9.72 శాతం వాటాలను అమ్మి రూ.592 కోట్లు, అంటే తాము చెల్లించిన దాంట్లో దాదాపు సగం, తిరిగి పొందారు. మన బ్యాంకుల యాజమాన్యం విదేశీ కంపెనీల చేతుల్లో ఉంటే అప్పుడు మన దేశంలోకి పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది అన్న వాదన కూడా పూర్తిగా తప్పుడు వాదనే. గతంలో విదేశీ వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను రిజర్వు బ్యాంక్ ఖచ్చితంగా పాటించినప్పుడు కూడా విదేశీ పెట్టుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రావడం తగ్గిపోయి, వెనక్కి వెళ్ళిపోవడం పెరుగుతోందంటే అందుకు వేరే కారణాలు ఉన్నాయి (ఉదాహరణకు ట్రంప్ సుంకాల పెంపు). కొన్ని బ్యాంకులను విదేశీ సంస్థలకు అమ్మేసినంత మాత్రాను విదేశీ పెట్టుబడులు వెనక్కి పోతున్న ధోరణిని ఆపడం కూడా సాధ్యం కాదు. విదేశీ సంస్థల పెత్తనం కిందికి మన దేశీయ బ్యాంకులను అనుమతించే ప్రక్రియ ఎందుకిలా గోప్యంగా ముందుకు సాగుతోంది? అందునా అటువంటి ప్రక్రియ వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వినాశకర ఫలితాలను చవి చూడవలసి వస్తుందని గుర్తించిన తర్వాత కూడా ఎందుకిలా జరుగుతోంది? (మన బ్యాంకులలో విదేశీ సంస్థల వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను తొలుత రూపొందించి అమలు చేసినది ఇందుకే కదా?)! బ్యాంకుల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే జరిగే హాని గురించి ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చెప్తున్నారన్న వాదన ఉంది. భారతీయ బ్యాంకులు విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం గురించి రిజర్వు బ్యాంక్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలు మన బ్యాంకులకు కొన్ని పరిమితులు విధించాయి. ఆ పరిమితులకు లోబడి వ్యవహరించినంత కాలం మన బ్యాంకుల యాజమాన్యం ఎవరి చేతుల్లో ఉందన్నది అంత ప్రధానం కాదు. ఈ వాదనను ఒకవేళ అంగీకరించినా, అసలు మన భారతీయ బ్యాంకులను విదేశీ సంస్థకు ఎందుకు అప్పజెప్పాలన్న ప్రశ్నకు అది సమాధానం చెప్పదు. విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే మన బ్యాంకుల నిర్వహణ బాగా మెరుగు పడుతుందన్న వాదన సైతం చెల్లదు. నిజానికి మన బ్యాంకులు విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే అప్పుడు ఇక్కడ చిన్న స్థాయి రుణాలను పొందేవారికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉండదు. నిజానికి బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నప్పుడు ఆ విధంగా జరగదు. పైగా అత్యున్నత స్థాయి అధికారుల జీతాలు మాత్రం బ్రహ్మాండంగా పెరుగుతాయి. కేథలిక్ సిరియన్ బ్యాంక్ అనుభవం ఇదే. అంతే కాదు, ఒకసారి మన బ్యాంకుల మీద పెత్తనం విదేశీ కంపెనీల చేతుల్లోకి పోయిన తర్వాత వాళ్ళు విదేశీ ఆస్తుల కొనుగోలు విషయంలో ఉన్న ప్రస్తుత నిబంధనలను, పరిమితులను ఎత్తివేయాలని మన ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతారు. ఆ పరిమితులను ఎత్తివేస్తే అప్పుడు ఈ బ్యాంకులు విదేశీ స్పెక్యులేటివ్ వ్యాపారాల్లో పెట్టుబడులను ఎక్కువగా పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ఎక్కువ లాభాలు వచ్చేటప్పుడు స్పెక్యులేటివ్ పెట్టుబడులైతే మాత్రం ఏమిటి నష్టం? అని ప్రశ్నించవచ్చు. స్పెక్యులేషన్ అంటేనే ఒక తరహా జూదం. అందులో లాభాలు వస్తున్నప్పుడు బాగానే ఉంటుంది. ఐతే, ఆ లాభాల్లో ఒక్క పైసా కూడా డిపాజిట్‌దారుల ఖాతాల్లో పడదు. అంతా యజమానులకే పోతుంది. ఒకవేళ ఆ స్పెక్యులేషన్‌లో నష్టం వస్తే మాత్రం అప్పుడు బ్యాంకులు దివాలా తీసే ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు డిపాజిటర్లు తమ కష్టార్జితాన్నంతటినీ పోగొట్టుకునే దుస్థితి వస్తుంది. అందుచేత చాలా పెద్ద సంఖ్యలో ఉండే డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడులకు దిగడం అనేది చాలా హానికరం. అందువలన భారతీయ డిపాజిటర్లకు లాభాలు ఏవీ రావు సరికదా తమ సమస్తాన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది. ఇదేదో పనీ పాటు లేనివాడెవడో ఊహించి చెప్తున్న విషయం కాదు. అమెరికాలో "హౌసింగ్ బుడగ" 2008లో పేలిపోయినప్పుడు ఆ బుడగ పెరుగుతున్న కాలంలో రుణాలు ఇచ్చిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని ప్రధాన బ్యాంకులన్నీ దెబ్బ తిన్నాయి. ఆ రుణాలన్నీ "పనికి మాలిన వ్యర్థ ఆస్తులు"గా ఆ బ్యాంకులకు మిగిలిపోయాయి. అప్పుడు ప్రభుత్వాలు బ్యాంకులకు భారీగా 'బెయిల్ ఔట్' ప్యాకేజీలు ప్రకటించవలసి వచ్చింది. ఆ బెయిల్ అవుట్ల కారణంగా డిపాజిటర్లు గణనీయంగా నష్టపోయారు.

# నేతల సంపద పైపైకి.. అభివృద్ధి అడుగుకు



న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా కోటీశ్వరుల కుటుంబాల సంఖ్య రెట్టింపు అవుతోంది. 2021- 2025 మధ్య మహారాష్ట్రలో 194 శాతం అంటే లక్షా 78 వేల 600 కుటుంబాలు కోటీశ్వరుల జాబితాలో చేరగా, ఈశాన్య ప్రాంతం చిత్రం అందుకు విరుద్ధంగా కన్పిస్తోంది. జాతీయ ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియ న్ డాలర్ల వైపు దూసుకువెళ్తుండగా, పుష్కలంగా వనరులు ఉన్న సరిహద్దు రాష్ట్రాలు అభివృద్ధి చెందక పోవడం, జాతుల ఘర్షణలు, మౌలిక సౌకర్యాల లోటు తో సతమతమవుతోంది. ఇక్కడి రాజకీయనాయకులు మాత్రం జాతీయ దిగ్గజాలతో పోటీగా సంపద కూడబెట్టుకుంటున్నారు. రాజకీయాలను లాభదాయకంగా మార్చుకుంటున్నారు. ఈ వ్యాసం ఈశాన్యరాష్ట్రాలలో అతి ధనవంతులుగా నాయకుల పెరుగుదలను పరిశీలిస్తుంది. ఇది ఈ ప్రాంతంలోని నాలుగున్నర కోట్ల మంది ప్రజల దిక్కుతోచని స్థితిలో ఎలా ఉంచిందో పరిశీలిస్తుంది. ఈశాన్య భారతంలో 8 రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర- లో రాజకీయాలు చాలాకాలం అధికారం, పోషణతో ముడిపడ్డాయి. కానీ, ఈమధ్య కాలంలో ఎన్నికైన ప్రజా ప్రతినిధుల ఆస్తుల విస్ఫోటనం సంభవించింది. ఇది జాతీయ స్థాయిలో కోటీశ్వరుల ఎదుగుదలను ప్రతిబింబిస్తోంది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫారమ్స్ (ఏడిఆర్ ) ప్రకారం అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి పేమా ఖండూ ఈ ప్రాంతంలో అత్యంత సంపన్న నాయకుడు. 2025లో ఆయన డిక్లరేషన్ ప్రకారం ఆయన ఆస్తులురూ. 1,500 కోట్లకు పైగానే. 2019లో అది రూ. 163 కోట్లు. ఆశ్చర్యకరమైన పెరుగుదల ఇది. 2016 నుంచిబిజేపీలో ఉన్న ఖండు రియల్ ఎస్టేట్, ఉద్యానవనాల వెంచర్ లు, కుటుంబ వ్యాపారాలే తన సంపద పెరుగుదలకు కారణం అంటున్నారు.కానీ, రాష్ట్రంలో ఖనిజ సంపద ఉన్న కొండప్రాంతాలలో భూ లావాదేవీలతోనే ఈ సంపద పెరిగిందని విమర్శకులు సూచిస్తున్నారు. అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వెనుకబడిలేరు. ఆయన ఆస్తులు 2025 నాటికి రూ. 1,200కోట్లకు పెరిగాయి. దశాబ్దం క్రితంరూ.90 కోట్లుగా ఉన్నాయి. శర్మ నిర్వహించే పోర్ట్ ఫోలియోలో ఫార్మస్యూటికల్స్, టీ ఎస్టేట్ లు, ఉండగా, విద్యా ట్రస్ట్ లలో ఆయనకు వాటాలు ఉన్నాయి. కాగా, ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులో గతంలో ఆయన ఆరోగ్య శాఖమంత్రిగా ఉండగా ఇచ్చిన కాంట్రాక్టులలో అక్రమాలు జరిగినట్లు తేలింది. త్రిపుర సిఎం మాణిక్ సాహా తన ఆస్తులు రూ. 800 కోట్లు గా ప్రకటించారు. వీటిలో ఎక్కువభాగం రియల్ ఎస్టేట్ లు, డెంటల్ క్లీనిక్ లనుంచి వచ్చినవే. నాగాలాండ్ లోని సిఫియు రియో ఆస్తి రూ. 450 కోట్లుగా ఉంది. కేంద్ర రహదారి ప్రాజెక్టుల నుంచి లబ్ధిపొందిన నిర్మాణ సంస్థలే ఇందుకు కారణంగా నిలిచాయి.ఏడిఆర్ చేపట్టిన 2025 ఎన్నికల అఫిడవిట్ల విశ్లేషణ చెబుతున్న గణాంకాల ప్రకారం భారతదేశంలోని టాప్ నలుగురు సీఎంలలో ఇద్దరు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులే. జాతీయస్థాయిలో ఖండు రెండో స్థానంలో, సాహా నాల్గో స్థానంలో ఉన్నారు. మహారాష్ట్రలో పట్టణ మిలియనీర్ల పెరుగుదలకు సాంకేతికత, ఆర్థికం కారణాలు కాగా, అందుకు భిన్నంగా, ఈశాన్య రాజకీయనాయకుల సంపద ప్రజా ప్రయోజనాలకు ఆజ్యం పోసే వనరులు, కలప, జలశక్తి, వాణిజ్యం నుంచి వస్తోంది. 2025 ఫేస్ బుక్ పోస్ట్ ప్రకారం ఈశాన్యభారతంలో ముఖ్యంగా అరుణాచల్ ప్రదేశ్ లో టాప్ 10 మంది ధనవంతుల రాజకీయ నాయకులు టాప్ లో ఉన్నారు. వారిలో ఖండు ముందున్నారు. ఎమ్మెల్యేలు లాంబో తయెంగ్, (రూ. 1,200 కోట్లుఫు టెసాంగ్ సేతి (రూ. 950కోట్లు )ఉన్నారు. వీరిలో చాలామంది మైనింగ్ రాయతీలలో చిక్కుకున్నారు. ఈ సంపద పెరుగుదల దేశవ్యాప్తంగా జరుగుతున్నదే. భారతదేశంలో 119 మంది కోటీశ్వర ఎమ్మెల్యేలు ఉన్నారు. మొత్తం స్థూల జాతీయ ఉత్పత్తిలో (జిడిపి) ఈశాన్య రాష్ట్రాలన్నీ కలిపి 3శాతం కన్నా తక్కువే. ప్రధాని నరేంద్రమోదీ 8 ఈశాన్య రాష్ట్రాలను బి అష్టలక్ష్మి గా ప్రశంసించారు. టీ, పెట్రోలియం, ఎకో టూరిజం దృష్ట్యా అన్నప్పటికీ, ఆ వ్యాఖ్యలో వ్యంగ్యం స్పష్టమవుతోంది. అష్టలక్ష్మి రాజకీయనాయకులపైనే దయచూపుతోంది. పేద, అట్టడుగు వర్గాలను కాదు. భారతదేశంలోని అత్యంత పేద రాష్ట్రాలలో పబ్లిక్ సర్వెంట్లు కోట్లు ఎలా కూడబెడుతున్నారు- దీనికి సమాధానం అవినీతి, ఆశ్రిత పక్షపాతం, కబ్జాలకు వత్తాసే. ఇక్కడ రాజకీయ పదవి ప్రైవేటు ఆర్జనకు ప్రధాన ద్వారంగా పని చేస్తోంది. ఈశాన్య ప్రాంతంలో, నార్త్ ఈస్ట్ ఇండస్ట్రియల్ డెవలప్ మెంట్ స్కీమ్ (ఎన్ఇఐడిఎస్) వంటి పథకాల ద్వారా కేంద్రం నిధులు ప్రవహిస్తాయి.

దక్కన్ సిమెంట్‌లో యుద్ధకాండ

మూలధనం పెట్టుబడిలో 30 శాతం సబ్సిడీ వస్తుంది. రాజకీయ నాయకులు కీలక పాత్రవహించి, బంధువులు, స్నేహితులకు లైసెన్స్ లు ఇస్తారు. భూ కేటాయింపులు అరుదైన కలప చెట్లతో కూడిన అటవీ భూమును అభివృద్ధి ప్రాజెక్టుల ముసుగులో లీజుకు తీసుకుంటారు. ఖండు కుటుంబ సంస్థలు బహుళ జలవిద్యుత్ కాంట్రాక్టులు పొందాయి. 2024 కాగ్ నివేదిక రూ. 500 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించింది. అసోంలో శర్మ సహచరులు టీ వేలంలో పెత్తనంచేస్తున్నారు. అక్కడ ఎగుమతి కోటాల కోసం లంచాలు నిత్య కృత్యంగా ఉన్నాయి. రియల్ ఎస్టేట్, సామాజిక ప్రాజెక్టులను అవినీతి హాట్ స్పాట్ లుగా మారాయని అధ్యయనంలో తేలింది. ట్రాన్స్పరెన్సీ ఇంటర్నేషనల్ సర్వే ప్రకారం ఈశాన్య రాష్ట్రాల లంచం రేట్లను 65 శాతంగా అంచనా వేసింది. ఇది జాతీయ సగటు 62 శాతం కంటే ఎక్కువ. పర్మిట్ల కోసం స్పీడ్ మనీ సగటున ఉద్యోగం, కాంట్రాక్టులకురూ.30 వేల నుంచి లక్షా 50 వేలు ఉంటోంది. ఇది అవకాశవాదం కాదు. క్రమబద్ధంగా సాగుతోంది. 1991 లో ఆర్థికవ్యవస్థ సరళీకరణ తర్వాత ఈ ప్రాంతం భౌగోళిక, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా 2018 కార్నేగీ ఎండోమెంట్ నివేదికలో పేర్కొన్నట్లుగా ఆమోదాలపై ఆధారపడే మధ్యస్థ సంస్థలకు ఓ వ్యవస్థ ఏర్పడింది. రాజకీయ నాయకులు దీనితో లబ్ది పొందారు. మణిపూర్ లో జాతి హింస నేపథ్యంలోనే సీఎం బీరేన్ సింగ్ (రూ10 కోట్లతో) అత్యంత పేద ఈశాన్య ముఖ్యమంత్రి. కానీ రూ. 300 కోట్ల వెంటర్లతో ఆయన కుటుంబం సంబంధం కలిగిఉంది.) సహాయ నిధులను పక్కదారి పట్టించారని ఆరోపించారు. తిరుగుబాటునాగాలాండ్ లోని ఎన్ ఎస్ సిఎన్ నుంచి అసోం లోని యుఎల్ ఎఫ్ ఏ వరకూ జాతి తిరుగుబాట్లు సాగాయి. దోపిడీ మొత్తాల నిధులు ప్రచారాలకు ఉపయోగ పడ్డాయి. రాజకీయాలు ఈ సమస్యలను మరింత తీవ్రతరం చేస్తాయి. మేఘాలయలో ముకుల్ సంగ్మా కుటుంబం మైనింగ్ లాబీలను నియంత్రిస్తుంది. సిక్కింలో ప్రేమ్ సింగ్ తమంగ్ ఆస్తులు 2019 తర్వాత 300శాతం పెరిగాయి. 2025 ఉఖ్రుల్ టైమ్స్ నివేదిక ప్రకారం భారతదేశంలోని నలుగురు ధనవంతులైన సీఎంలలో ఇద్దరు ఈశాన్య ప్రాంతాలకు చెందినవారు. నాయకులు అభివృద్ధి చెందుతుండగా, రాష్ట్రాలు కుదేలయితున్నవైరుధ్యం ఇది. ఈశాన్య రాష్ట్రాల దురదృష్టం రాజకీయ దురాశ అభివృద్ధిని దెబ్బతీస్తోంది. 2014 నుంచి యాక్ట్ ఈస్ట్ పాలసీ కింద కేంద్ర రూ. 3 లక్షలకోట్లు ఇచ్చినా, ఈ ప్రాంతం తలసరి ఆదాయం రూ. 1.2 లక్షల వరకే ఉంది. ఇది జాతీయ సగటులో సగం. నిరుద్యోగం 12 శాతం ఉంటే, జాతీయస్థాయిలో 6 శాతం ఉంది. మౌలిక సదుపాయాలలోనూ వెనుకబడి ఉన్నాయి. 2025 నీతీ ఆయోగ్ అంచనా ప్రకారం 40 శాతం మాత్రమే రోడ్లు ఉన్నాయి. 60 శాతం గ్రామాలు విద్యుత్ అంతరాయంతో కుదేలవుతున్నాయి. ఎకనమిగ్ అండ్ పొలిటికల్ వీక్లీ 2021లో చేసిన అధ్యయనం ప్రకారం,

# ఇది అమెరికాకే స్వీయహాని

సెంట్రల్ డెస్క్:విదేశీ వృత్తినిపుణులు అమెరికాలో తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకోవాలంటే హెచ్1 బీ వీసా దరఖాస్తులు తప్పనిసరి. ఈ వీసా దరఖాస్తు రుసుం ప్రస్తుతం 2000 నుంచి 5000 డాలర్ల వరకు ఉండగా, ఇప్పుడు అమాంతంగా లక్ష డాలర్లకు వన్‌టైమ్ చెల్లింపుగా పెంచడం ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రతి దేశం నుంచి నైపుణ్యం కలిగిన వారిని అమెరికా సంస్థలు ఆహ్వానించడం గత కొన్ని దశాబ్దాలుగా సాగుతుండగా ఇప్పుడు ఈ వీసా భారం ఆ అవకాశాలపై పిడుగుపటినట్టయింది. ప్రస్తుతం హెచ్1 బీ వీసాలు కలిగి ఉన్న వారిపై ఎలాంటి ప్రభావం ఉండబోదని, కొత్త దరఖాస్తుదారులకే లక్ష డాలర్ల రుసుం వర్తిస్తుందని అమెరికా ప్రభుత్వం వివరణ కొంత ఊరట కలిగిస్తున్నా భవిష్యత్ పరిణామాలు మాత్రం తీవ్రంగా ఉంటాయి. సాంకేతిక పరంగా వివిధ రంగాల్లో అమెరికా అగ్రస్థానంలో ఉండడానికి ఇతర దేశాల నుంచి వచ్చి పనిచేస్తున్న నిపుణులే అన్నది వాస్తవం. సైన్స్, టెక్నాలజీ, మెడిసిన్, తదితర రంగాల్లో అమెరికా ప్రతిభ , నైపుణ్యాల కొరతతో అల్లాడుతోంది. ఈ లోటు విదేశీ నిపుణులతోనే తీరుతోంది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా తదితర ఐటి దిగ్గజ సంస్థలు హెచ్1 బి వీసాలపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి. 2025 లోనే అమెజాన్ సంస్థ 12 వేలకు పైగా హెచ్1 బి వీసా అనుమతులు పొందింది. ఇప్పుడు ఈ వీసాలకు ఒక్కోదానికి లక్ష డాలర్ల వంతున వచ్చే మూడేళ్లలో ఒక్క అమెజాన్ సంస్థే ఏకంగా 3.6 బిలియన్ డాలర్లు అంటే రూ.31 వేల కోట్లు అదనంగా ఖర్చు చేయ వలసి వస్తుంది. ఈ విధంగా మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ఎన్‌విడియా, ఒరాకిల్ తదితర టాప్ 5 ఐటీ దిగ్గజ సంస్థల వార్షిక ఆదాయం 80 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ.7 లక్షల కోట్లు కాగా, ఈ ఐదూ కలిపి 10 వేల కొత్త హెచ్1 బీ వీసాల కోసం దరఖాస్తు చేస్తే తమ వార్షికాదాయం పై రూ.8 వేల కోట్ల మేర నష్టం సంభవిస్తుందని అంచనాగా తెలుస్తోంది. హెచ్1 బీ వీసాదారులైన ఉద్యోగుల సరాసరి వేతనం ఏడాదికి 100, 000 నుంచి 200, 000 డాలర్ల వరకు ఉంటుంది. అమెరికాలో మధ్యతరగతి ఆదాయం కన్నా ఇది చాలా తక్కువ. భారతీయ ఉద్యోగులు, కార్మికులు అక్కడ చాలా చవకగా తమ శ్రమను ధారపోస్తున్నా భారతీయ కన్సల్టింగ్ సంస్థలు సాధారణంగా తమ క్లయింట్ల నుండి ఏటా 150,000 నుంచి 200, 000 డాలర్ల వరకు వసూలు చేస్తుంటాయి. అంటే అక్కడ ఉద్యోగికి వచ్చే జీతం కన్నా ఎక్కువ. ందులో ట్రావెల్, వీసా దరఖాస్తులు,శెలవులు తదితర ఖర్చులన్నీ కలుపుకుని ఉంటాయి. ఈ ఉద్యోగాలకు అమెరికాలో ఉన్న డిమాండ్‌కు స్థానికంగా మానవ వనరులు లభించడం లేదు. 2024లో హెచ్1 బీ వీసాల్లో 71 శాతం భారతీయులే ఉన్నారు. వారంతా తక్కువ నైపుణ్యం కలిగిన కార్మికులు కాదు. ఇంజినీర్లు, రీసెర్చర్లు, ఆర్కిటెక్టులు, అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి ఐటీ దిగ్గజాల్లో అత్యాధునిక సాంకేతిక నిపుణులుగా రాణిస్తున్నారు. ఇప్పుడు వీరందరిపై కేవలం చిన్నచూపే కాదు, వ్యూహాత్మకంగా అమెరికా తనకు తాను స్వీయ హాని తెచ్చుకున్నట్టే. అయితే హెచ్1 బి పద్ధతి దుర్వినియోగం




మవుతోందని అమెరికా గగ్గోలు పెడుతుండటం నిజమే. కొన్ని సంస్థలు ఈ హెచ్1 బీ వీసాదారుల బలహీనతలతో ఆడుకుంటున్నాయి. తక్కువ వేతనాలు చెల్లించి చేతులు దులుపుకుంటున్నాయి. కొన్ని దశాబ్దాలుగా తమ అత్యధిక నైపుణ్య సామర్థ్యాలతో అమెరికాను సాంకేతిక ఆధిపత్యస్థాయికి తీసుకువచ్చే వారెవరో తెలిసిందే. ఈ ప్రపంచాన్ని శిక్షించడమంటే మన స్వంత భవిష్యత్తును నాశనం చేయడమే. భారత దేశం విషయంలో ఈ సంకేతాలు దౌత్యపరమైన అంశానికి మించి కనిపిస్తున్నాయి. అమెరికా నైపుణ్యాలకే పన్ను విధించి అవకాశాలను పరిమితం చేస్తుంటే భారత దేశం మౌన ప్రేక్షకునిలా అంగీకరించడం మానుకోవాలి. అంతర్గతంగా దృష్టి కేంద్రీకరించాలి. ఈ యుగం చాలా వేగంగా సాగుతోంది. స్వదేశీ సామర్థ్యాన్ని పెంపొందించుకోడానికి ఇదే సరైన అవకాశం. భారత్ కేవలం నైపుణ్య ఎగుమతిదారు కాకూడదు. ఆలోచనలకు, ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గమ్యస్థానం కావాలి. వాషింగ్టన్ నుంచి వచ్చే సందేశం సుస్పష్టం. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల్లో స్థానిక అమెరికన్లకే మొదట ప్రాధాన్యం ఇవ్వడానికే ట్రంప్ ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారని వైట్‌హౌస్ సమర్థిస్తోంది. గ్రేట్ ఎగైన్ అమెరికా సిద్ధాంతాన్ని తెరపైకి తెస్తోంది. ఇప్పుడు నైపుణ్యానికే అత్యంత విలువ. భారత్ తగినట్టు స్పందించాలి. అవకాశాలకు కొత్త చిరునామా అవసరం. ఇది ప్రతీకారం కాదు. పునరుద్ధరణ కార్యక్రమం. భారతీయ నైపుణ్యాన్ని బహిష్కరిస్తే మనం దానిని అందిపుచ్చుకోవాలి. ప్రపంచ మేధో పరిజ్ఞాన ప్రముఖులు తదుపరి దేన్ని నిర్మించాలకుంటున్నారో దానికి భారత్ హబ్ గా రూపొందాలి. కృత్రిమ మేధ (ఎఐ), సెమీ కండక్టర్స్, రోబోటిక్స్, క్వాంటమ్, డ్రోన్ టెక్నాలజీ, తదితర సాంకేతిక, వైజ్ఞానిక పురోగతి (డీప్‌టెక్)లో ఉన్నంతగా ఈ ఆవశ్యకత మరెక్కడా లేదు. ఇవి 21 వ శతాబ్దంలో ప్రపంచ శక్తికి గట్టి పునాదులు. భారత్‌కు ముడి వనరులు ఉన్నాయి. ఆపైన నైపుణ్యం, రిస్క్ కోరుకునే స్టార్టప్‌లు, విధానపరమైన లక్షాలు ఉన్నాయి. భారత ప్రభుత్వం రూ. 10,000 కోట్లతో డీప్‌టెక్ ఫండ్‌ను ప్రారంభించింది. వచ్చే దశాబ్దానికి రీసెర్చి అండ్ డెవలప్‌మెంట్, వాణిజ్యపురోగతి తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించడానికి భారత్‌కు రూ.లక్ష కోట్ల డీప్‌టెక్ మిషన్ అవసరం. ఇన్నాళ్లూ అమెరికా వంటి దేశాలపై ఆధారపడే కాలం నాయకత్వ యుగానికి దారి తీయాలి.

# వైద్య కళాశాలను పిపిపి విధానంలో నిర్మిస్తాం

అమరావతి: మార్కాపురం ఆస్పత్రి వైద్య కళాశాల నిర్మాణానికి.. వైసిపి రూ. 47 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందని ఏపి మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..వైద్య కళాశాలను పిపిపి విధానంలో నిర్మిస్తామని, 640 పడకల ఆస్పత్రి నిర్మాణం చేస్తున్నామని తెలియజేశారు. గిద్దలూరు, కనిగిరి, కోవూరు ఆస్పత్రుల్లో సిబ్బందిని నియమిస్తాం అని సత్యకుమార్ పేర్కొన్నారు.

# ట్రైబ్యునల్ ముందు రాష్ట్ర వాదనలు స్వయంగా పరిశీలిస్తా

ఢిల్లీ: కృష్ణా జలాల్లో న్యాయపరమైన వాటా సాధిస్తామని నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కృష్ణా ట్రైబ్యునల్ లో సమర్థమైన వాదనలు వినిపిస్తామని అన్నారు. ఇవాల్టి నుంచి 3 రోజుల పాటు కృష్ణా ట్రైబ్యునల్ లో వాదనలు జరుగుతాయని, ట్రైబ్యునల్ లో వాదనల దృష్ట్యా ఢిల్లీకి వెళ్లారు. ఈ సందరర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..ట్రైబ్యునల్ ముందు రాష్ట్ర వాదనలు స్వయంగా పరిశీలిస్తానని, బ్రిజేష్ ట్రైబ్యునల్-2 ఉమ్మడి ఏపికి 1050 టిఎంసిలు కేటాయించిందని తెలియజేశారు. ఇప్పుడు కృష్ణా జలాల్లో రాష్ట్రానికి 70 శాతం వాటా కోరుతున్నామని, నదీ పరివాహకం, సాగు భూమి, జనాభా ఆధారంగా అధిక వాటా కోరుతున్నామని అన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం వల్లే కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. కేవలం 299 టిఎంసిలకే అంగీకరిస్తూ మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వం సంతకం చేసిందని, అప్పుడు టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పని వల్ల రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపి ప్రభుత్వం కృష్ణా బేసిన్ అవతలకు జలాలను తరలిస్తోందని ఉత్తమ్ విమర్శించారు. ఆల్మట్టి ఎత్తు పెంపునకు అడ్డుకుని తీరుతామని, తెలంగాణ జల హక్కులను కాపాడుందుకు ఎవరితోనైనా పోరాడుతామని ఉత్తమ్ కుమార్ రెడ్డి సవాల్ విసిరారు.

# ఆ ఇద్దరూ మంత్రులు!

విజయవాడ:ఉత్తరాంధ్రాలో కూటమికి నలుగురు మంత్రులు ఉన్నారు. ఈ నలుగురూ తెలుగుదేశం పార్టీకి చెందిన వారే. వీరి పనితీరుని ఎప్పటికపుడు టీడీపీ మధింపు చేస్తోంది. ఇప్పటికి పదిహేను నెలలు పాలన సాగింది. దాంతో మంత్రులు ప్రభుత్వపరంగా చేయాల్సిన కార్యక్రమాలు కానీ చూపించాల్సిన జోరు కానీ చాలానే ఉంటుంది. ఒక విధంగా హానీమూన్ సమయం పూర్తి అయింది. దాంతో మంత్రులకు అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దిశానిర్దేశం చేస్తూ వస్తున్నారు. ఆ మధ్యన మంత్రుల పనితీరు మీద ముఖ్యమంత్రి ఒకసారి హెచ్చరించినట్లుగా వార్తలు వచ్చాయి. అందులో కొందరిని పక్కకు పెట్టవచ్చు అని కూడా ప్రచారం సాగింది. అయితే ప్రభుత్వానికి బొత్తిగా ఏడాది కూడా కాలేదని ఆగారని కూడా చెప్పుకున్నారు. మరో మూడు నెలలు ఆగితే ఏణ్ణర్ధం అవుతుంది. అయినా మంత్రులు జోరు చేయకపోతే ప్రభుత్వానికే ఇబ్బంది అని కూటమి పెద్దలు భావిస్తున్న నేపథ్యం ఉంది. కొద్ది నెలల క్రితం పనితీరు బాగా లేదని ప్రచారం సాగిన మంత్రులలో ఉత్తరాంధ్రా నుంచి ఒకరిద్దరు ఉన్నారు అని చర్చ జరిగింది. అప్పట్లో జూనియర్ మంత్రుల పేరులు ఎక్కువగా అంతా ఆలోచించారు. అయితే ఇపుడు మాత్రం సీనియర్ మంత్రి విషయంలోనే ప్రభుత్వం అసంతృప్తిగా ఉందని ప్రచారం సాగడం విశేషం. అలాగే ఒక మహిళా మంత్రి విషయంలోనూ అదే విధంగా కూటమి పెద్దలు భావిస్తున్నారు అని అంటున్నారు. ఆ మధ్య దాకా విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి తొలిసారి ఎమ్మెల్యే అయిన కొండపల్లి శ్రీనివాస్ విషయంలోనే అంతా చర్చించేవారు ఒకేసారి ఎమ్మెల్యే మంత్రి వచ్చేసరికి ఆయన తడబడుతున్నారు అని కూడా అనుకున్నారు. అయితే నెమ్మదిగా ఆయన పట్టు సాధిస్తున్నారు. జిల్లాలో తన మాట చెల్లేలా చేసుకుంటున్నారు. అటు పార్టీని ప్రభుత్వాన్ని కూడా సమన్వయంతో నడిపిస్తున్నారు అని అంటున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను కూడా ప్రజలకు మీడియాకు వివరిస్తూ ముందుకు సాగుతున్నారు. అయితే ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విషయంలోనే కొంత అసంతృప్తి కనిపిస్తోంది అని అంటున్నారు. ఆమె పనితీరులో వేగం లేకపోవడంతో గిరిజన శాఖలో అవినీతి వెల్లువెత్తుతోందన్న ఆరోపణలు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయని అంటున్నారు. ఇదే శాఖలో ఒక చీఫ్ ఇంజనీర్ లంచం తీసుకుంటూ ఏసీబీకి దొరికిపోవడం పెను సంచలనం రేపింది. దీంతోనే ఇపుడు ఆ శాఖ మంత్రిగా ఆమె ఇబ్బంది పడుతున్నారని అంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో చూస్తే సీనియర్ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీలకమైన వ్యవసాయ శాఖ మంత్రిగా తన పనితీరుని సరిగ్గా కనబరచడం లేదని విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా యూరియా కొరత విషయంతో ఆయన సమర్థత మీద విపక్షాలు ఆరోపణలు గుప్పిస్తూంటే అధికార కూటమి వెనకేసుకుని రాలేని పరిస్థితి ఉంది అని అంటున్నారు. దాంతో పాటుగా ఏడాదిన్నర మంత్రిత్వంలో ఆయన శాఖ విషయంలో ఎన్నో విమర్శలు విపక్షాలు చేస్తూనే ఉన్నాయి. ఎంతో ముఖ్యమైన శాఖను ఆరు సార్లు ఎమ్మెల్యేగా చేసిన సీనియర్ నేతకు అప్పగిస్తే ప్రభుత్వం ఇబ్బంది పడుతోందని కూటమి పెద్దలు భావిస్తున్నారని టాక్. ఇక తన పదవిని కాపాడుకోవడం కోసం అచ్చెన్నాయుడు వైసీపీ మీద విమర్శలు చేస్తున్నారు మంత్రి సొంత నియోజకవర్గం టెక్కలి వైసీపీ ఇంచార్జి పేడాడ తిలక్ మండిపడుతున్నారు. మంత్రి అసమర్ధుడని కూడా నిందించారు. ఇవన్నీ పక్కన పెడితే యూరియా బస్తాలు బ్లాక్ మార్కెట్ కి తరలివెళ్ళాయన్న ఆరోపణలు కూడా మంత్రిని ఇబ్బంది పెడుతున్నాయని అంటున్నారు. దీని మీద బహిరంగ చర్చకు తాము సిద్ధమని మంత్రి అనుచరులే బ్లాక్ చేస్తున్నారు అని పేడాడ తిలక్ సవాల్ చేశారు. రాష్ట్రంలో రైతులు అంతా ఎరువులు విత్తనాలు లేక గిట్టుబాటు ధరలు లేక నానా అగచాట్లు పడుతున్నారని వ్యవసాయ మంత్రికి కనీస అవగాహన లేకపోవడం వల్లనే ఈ దుస్థితి అని వైసీపీ దుయ్యబెడుతోంది. మరో వైపు జిల్లాలో కూడా పార్టీలో వర్గ పోరు రాజుకోవడం మంత్రిగా ఉంటూ అచ్చెన్నాయుడు ఈ విషయంలో చక్కబెట్టాల్సిన తీరులో వ్యవహరించకపోవడం కూడా పార్టీ పెద్దల దృష్టిలో ఉంది అని అంటున్నారు. ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సైతం తనను అణగదొక్కేందుకు సొంత పార్టీలోని వారే చూస్తున్నారు అని పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేసినట్లుగా చెప్పుకుంటున్నారు. మొత్తం మీద చూస్తే సీనియర్ మంత్రికిగా అచ్చెన్నాయుడు పనితీరు అయితే పెద్దలకు అంతగా నచ్చడం లేదు అనే అంటున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో చూస్తే హోం మంత్రిగా కీలక శాఖను చూస్తున్న వంగలపూడి అనిత మీడియా ముందు గట్టిగానే మాట్లాడుతూ ప్రభుత్వాన్ని సమర్ధిస్తూ వస్తున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో కొంత ఇబ్బంది ఉన్నా అనిత మాత్రం కూటమి ప్రభుత్వాన్ని ఎప్పటికపుడు కాసుకొస్తూండడం ఆమెకు ప్లస్ పాయింట్‌గా ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి వర్గ విస్తరణ అంటూ ఉంటే కనుక ఉత్తరాంధ్రా నుంచి భారీ మార్పులే ఉంటాయని అంటున్నారు. శ్రీకాకుళం నుంచి మార్పు మొదలవుతుందని విపక్షాలు అంటున్నా కూటమి పెద్దలు కూడా చాలా సమీకరణలు బేరీజు వేసుకుంటున్నారు అని అంటున్నారు.

# నవంబర్ లోగా బెంగళూరులో గుంతలు లేని రోడ్లు!

కర్నాటక రాజధాని బెంగళూరులో రోడ్ల పరిస్థితిపై సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలపై ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందించారు. నవంబర్ నాటికల్లా బెంగళూరు నగరంలో రోడ్లపై గుంతలనేవే ఉండవని చెప్పారు. ఆ విధంగా కాంట్రాక్టర్లకు స్పష్టమైన గవుడు విధించినట్లు చెప్పారు. అయినా దేశ రాజధాని నగరం ఢిల్లీలో ఏకంగా ప్రధాని నివాసం ముందు రోడ్డుపైనా గుంతలు ఉన్నాయన్నారు. అంతెందుకు.. రోడ్లపై గుంతలు ఉండటం అన్నది దేశ వ్యాప్త సమస్య అన్న డీకే శివకుమార్.. వాటిని వేటినీ పట్టించుకోకుండా మీడియా కేవలం బెంగళూరునే లక్ష్యం చేసుకుందని విమర్శించారు. గతంలో కర్నాటకలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం సరిగ్గా పనిచేసి ఉంటే రోడ్లు ఎందుకిలా ఉంటాయని ప్రశ్నించారు.బెంగళూరు రోడ్లు గుంతలమయంగా మారిపోయాయంటూ కేంద్ర మంత్రి హెచ్ డీ కుమార స్వామి విమర్శించిన సంగతి తెలిసిందే.అదే విధంగా ఒక టెక్ కంపెనీ సీఈవో కూడా బెంగళూరు రోడ్ల దుస్థితిపై సామాజిక మాధ్యమ వేదికగాచేసిన పోస్టు వైరల్ అవ్వడమే కాకుండా, బెంగళూరు నుంచి సదరు కంపెనీని తరలించాలని భావిస్తున్నట్లుగా ఆ సీఈవో ఆ పోస్టులో పేర్కొన్నారు. దానికి స్పందించిన ఆంధ్రప్రదేశ్ ఐటీ మంత్రి నారా లోకేష్ ఆ కంపెనీని విశాఖకు ఆహ్వానించిన సంగతి తెలిసిందే.

# దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహిద్దాం

న్యూఢిల్లీ,నవరాత్రి మొదటి రోజైన సోమవారం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు బహిరంగ లేఖను రాశారు. ఈ లేఖలో ఆయన దేశ ప్రజలందరికీ స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. దుకాణదారులు అందరూ 'భారతదేశంలో తయారు చేసిన' ఉత్పత్తులను విక్రయించాలని విజ్ఞప్తి చేశారు. 'మనం గర్వంగా చెప్పుకుందాం - మనం కొనేది స్వదేశీ, మనం అమ్మేది స్వదేశీ' అని ప్రధాని బహిరంగ లేఖలో పేర్కొన్నారు. దేశంలో నూతన ఏ÷ు సంస్కరణలు అమలులోకి రావడంతో తగ్గిన ఏ÷ు రేట్లు- 375 వస్తువులపై వర్తిస్తాయని పేర్కొన్నారు. ఆటోమొబైల్స్ నుంచి రోజువారీ వినియోగ వస్తువుల వరకు ఈ జీఎస్టీ తగ్గింపు జరిగిందని తెలిపారు. జాతినుద్దేశించి ఆదివారం ప్రధాని నరేంద్ర మోడీ మాట్లాడుతూ.. ఆదాయపు పన్ను సంస్కరణలతో పాటు-, నేటి నుంచి అమల్లోకి వచ్చే జీఎస్టీ రేటు- సవరణలతో భారతీయులు ... 2.5 లక్షల కోట్లు- ఆదా అవుతుందన్నారు. ప్రధాని దీనిని 'బచత్ ఉత్సవ్' గా అభివర్ణించారు. తగ్గిన జీఎస్టీ రేట్లు- పేదలకు, మధ్యతరగతికి గొప్ప ఉపశమనం కలిగిస్తాయని చెప్పారు. ఈ సంస్కరణలతో యువత, రైతులు, మహిళలు, దుకాణదారులు, వ్యాపారులు, వ్యవస్థాపకులు అందరూ గొప్ప ప్రయోజనం పొందుతారని అన్నారు. పండుగ సీజన్‌లో జీఎస్టీ తగ్గింపు అనేది ప్రజలకు మరింత ఆదా అవుతుందన్నారు. కొత్త జీఎస్టీ విధానం మధ్యతరహా, చిన్న వ్యాపారాలపై చూపే సానుకూల ప్రభావాన్ని ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ఇది పోటీ-తత్వాన్ని, ఆర్థిక వ్యవస్థను పెంచుతుందని అన్నారు.జీఎస్టీ తగ్గింపుతో స్నాక్స్, కాఫీ, నెయ్యి, పనీర్, వెన్న, కెచప్, జామ్, డ్రై ఫ్రూట్స్, ఐస్ క్రీం వంటి రోజువారీ వినియోగ వస్తువులపై రేట్లు- తగ్గుతాయి. టీ-వీలు, ఎయిర్ కండిషనర్లు, వాషింగ్ మెషీన్లు వంటి వస్తువులపై కూడా ఏ÷ు తగ్గించారు. ఔషధాలపై 12శాతంనుంచి 5శాతానికి జీఎస్టీ తగ్గించారు. క్యాన్సర్, జన్యుపరమైన, అరుదైన వ్యాధులకు కీలకమైన ప్రాణాలను రక్షించే మందులను పూర్తిగా పన్ను నుంచి మినహాయించారు.

# జీఎస్టీ అమలను పర్యవేక్షిస్తున్నాం

న్యూఢిల్లీ,జీఎస్టీ- సంస్కరణలు అమల్లోకి రావడంతో నిత్యావసరాల నుంచి కార్ల వరకు పన్నుల భారం తగ్గి, కొనుగోలుదార్లకు భారీగా సొమ్ము ఆదా కానుంది. జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చినప్పటికీ కొన్ని ఈ-కామర్స్ వేదికలు ఆ ప్రయోజనాలను బదిలీ చేయడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయి. వీటిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఈ ఫిర్యాదులపై ఆరా తీస్తున్నట్లు- వెల్లడించాయి. ధరల మార్పును పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించింది. ఈ ఫిర్యాదులపై ఇప్పుడే స్పందించలేం. సెప్టెంబర్ 30లోగా క్షేత్రస్థాయిలో జీఎస్టీ అమలుపై నివేదిక అందనుందని పేర్కొన్నాయి. జీఎస్టీ 2.0 సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. దాంతో కిరాణా సరకులపై కుటుంబ ఖర్చులు 13శాతం తగ్గనుండగా, ఒక చిన్న కారు కొనుగోలు చేస్తే దాదాపు రూ.70,000 వరకు ఆదా కానుంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం.. స్టేషనరీ, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలపై ఖర్చులు 7-12శాతంతగ్గనున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18శాతం పన్నును తొలగించడంతో.. ఈ మేరకు ఆదా కానుంది. మొత్తం 375 రకాల వస్తువులపై జీఎస్టీ- రేట్లు- తగ్గాయి.

# కారణం అదేనా?

అమరావతి,ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అదే బీజేపీ కేంద్రంలోని ఎన్డీఏ కూటమిలో ప్రధాన పార్టీ. రాష్ట్రంలోని కూటమిని వ్యతిరేకించే ఏ పార్టీ అయినా కేంద్రంలోని కూటమిని వ్యతిరేకించినట్టే లెక్క. కానీ ఏపీలో అలా కాదు, ఆ మాటకొస్తే అసలు జగన్ తీరే వేరు. జగన్ ఎన్డీఏ కూటమిలో చేరరు, అలాగని బయట సైలెంట్ గా ఉండరు. ఎన్డీఏ తీసుకునే ఏ నిర్ణయానికైనా ఆయన సై అంటారు, ఒకవేళ అనలేదా? ఏం జరుగుతుందో జగన్ కే బాగా తెలుసు. ఇటీవల ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో జైలునుంచి ప్రత్యేక అనుమతి తీసుకుని వచ్చి మరీ వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి ఓటు వేశారు. ఆయన ఎవరికి ఓటు వేశారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తాజాగా జగన్ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలను ఓ రేంజ్ లో మోసేశారు. జీఎస్టీకి సంస్కరణలకు ఆయన జీ హుజూర్ అన్నారు. జీఎస్టీ సవరణను విప్లవాత్మక చర్యగా అభివర్ణించారు జగన్. పన్నుల విధానాన్ని మరింత సరళతరం చేస్తూ, సామాన్యులు కూడా భరించేలా జీఎస్టీలో మార్పులు చేయడం అభినందనీయం అని కొనియాడారు. అక్కడక్కడ కొన్ని లోటుపాట్లు ఉన్నా, అభ్యంతరాలు ఎదురైనా, జీఎస్టీలో సవరణ ఫలాలు ప్రతి వినియోగదారుడికి చేరుతాయని తాను నమ్ముతున్నట్టు చెప్పారు. దేశంలో వస్తువుల వినియోగంతో పాటు, పెట్టుబడుల రంగానికి ఈ సంస్కరణలు మరింత ప్రోత్సాహకంగా ఉంటాయన్నారు జగన్.

జగన్ కాదు భజన్

ఈ మాట స్వయానా జగన్ చెల్లెలు షర్మిలే అంటున్నారు. మోదీ భజనలో జగన్ ఆరితేరిపోయారంటున్నారు. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన.. మోదీని పొగిడినా, మోదీ నిర్ణయాల్ని స్వాగతించినా పెద్ద పట్టింపు లేదని, కానీ జగన్ ఇలా తయ్యారేంటని ఆమె పలుమార్లు నిలదీశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బిడ్డగా ఆయన వ్యతిరేకించిన బీజేపీతో జగన్ మిలాఖత్ కావడాన్ని షర్మిల తీవ్రంగా తప్పుబట్టారు. కానీ జగన్ అవేవీ పట్టించుకోరు. మోదీని ప్రసన్నం చేసుకోవడమే ఆయన ప్రధాన కర్తవ్యం.

మండలిలో బుక్కైన వైసీపీ..

శాసన సభకు వైసీపీ ఎమ్మెల్యేలు హాజరు కావడం లేదు, శాసన మండలికి మాత్రం వారు కచ్చితంగా హాజరవుతున్నారు. ఈ క్రమంలో జీఎస్టీ సంస్కరణలకు మద్దతుగా మండలిలో ఓ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానానికి వైసీపీ ఓటు వేయలేదు. అలాగని తీర్మానాన్ని తిరస్కరించనూ లేదు.

# భారత్-అమెరికా సంబంధాలు ఎటు?



సెంట్రల్ డెస్క్:రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ యుక్రెయిన్ యుద్ధానికి ఆజ్యం పోస్తోందనే కుంటిసాకుతో, భారత్ అధిక సుంకాలు విధిస్తూ 'సుంకాల రారాజు'గా నిలిచిందని ఆరోపిస్తూ ప్రతీకారంగా అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 50 శాతం దిగుమతి సుంకాలు విధించడంతో వాణిజ్యంలో తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఈ విషయమైయమై బ్రెండెన్ లింన్చ్ నాయకత్వంలో క్రొత్త ఢిల్లీకి వచ్చిన అమెరికా ప్రతినిధి బృందానికి, భారత వాణిజ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి భారత బృందానికి మధ్య జరిగిన చర్చల్లో పెద్ద పురోగతి కనిపించలేదు. అయితే భారత ప్రధాని నరేంద్రమోడీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఫోన్ చేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేయడం, దృశ్య మాధ్యమాల ద్వారా చర్చలు కొనసాగించి రత్వరలోనే ఒక అంగీకారానికి రావాలని నిర్ణయించడమే ఓ సానుకూల పరిణామంగా భావిస్తున్నారు.భారత్‌కు పత్తి, మొక్కజొన్న, సోయాబీన్ వంటి వ్యవసాయోత్పత్తులు, పాలు, వివిధ రకాల వెన్నలు, పాలపొడి వంటి పాడి ఉత్పత్తులు ఎగుమతి చేయాలని, 146 కోట్ల అతి పెద్ద జనాభా గల మార్కెట్‌ను చేజిక్కించుకోవాలని అమెరికా తహ తహలాడుతోంది. అందుకు సరళమైన సుంకాల తో అనుమతి ఇవ్వాలని దశాబ్దాలుగా మన దేశంపై ఒత్తిడి తెస్తోంది. అయితే 86 శాతం చిన్న, సన్నకారు రైతులు, 8కోట్ల పాడిరైతుల జీవితాలపై దుష్ప్రభావము పడుతుందని భారత ప్రభుత్వం అందుకు అంగీకరించడంలేదు. అదీగాక పాల అధికోత్పత్తికి వాడే దాణాలో కలిపిన ఏంజైములుమ మాంస కృత్తులు అధికంగా ఉండటం, ఆరోగ్యానికి హానికరమని భావించడం, అవి భారత ఆచారాలు, సాంప్రపదాయలు,ఆహార అలవాట్లకు విరుద్ధంగా ఉండటం వల్ల ప్రభుత్వం వాటికి అనుమతించడము లేదు.దీంతో డాలర్ ప్రభువు ట్రంప్‌కు పట్టరాని ఆగ్రహము కిలిగి భారత్‌ను ఆర్థికంగా దెబ్బతీయడానికి 50 శాతం సుంకాలు విధించడంతో, జౌళీ వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, వజ్రాలు, స్వర్ణాభరణాలు, టోలు వస్తువులు, పాదరక్షలు, సుగంధ ద్రవ్యాలు రబ్బర్, రొయ్యలు, చేపలు, ఇతర మత్స్య సంపద ఉత్పత్తిలో భాగస్వాములైన లక్షలాది మంది మహిళలు ఇతర శ్రామికుల జీవనోపాధులపై తీవ్ర ప్రభావం పడింది. పనులు, ఆదాయాలు కోల్పోయివారు వీధినపడి ఆక్రోషిస్తున్నారు.రొయ్యల ఎగుమతులలో 80 శాతం, చేపలు, సముద్రఉత్పత్తులో 39 శాతం ఆంధ్రప్రదేశ్ నుండి జరుగుతున్నాయి. ట్రంప్ సుంకాల దెబ్బకు వాటి ఎగుమసతులు ఆగిపోయి 25 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ,అంచనా. అమెరికాను మళ్ళీ గొప్ప దేశంగా అభివృద్ధి చేస్తానని, తయారీ రంగంలో మేటిగా నిలుపుతానని, అన్నింటా అమెరికాయే ఫస్ట్ అని నినదిస్తూ, శ్వేత జాతి దురహంకారాన్ని రెచ్చగొట్టి రెండో దఫా అమెరికా అధ్యక్షుడైన ట్రంప్ ఇంటాబయటా పెట్రేగి పోతున్నాడు.భారత్‌పైనే గాక బ్రెజిల్, అర్జెంటీనా, మెక్సికో, కెనడా తదితర దేశాలపై భారీ సుంకాలు విధించి అమెరికా మళ్లీ సామ్రాజ్యవాద పెత్తనాన్ని, ప్రాబల్యాన్ని పెంచడానికి చేస్తున్న యత్నాలు అంతర్జాతీయ వ్యవస్థలను అతలాకుతలం చేస్తున్నాయి. వ్యవసాయోత్పత్తులకు సంబంధించి భారత్ 64.3, దక్షిణ కొరియా 57 శాతం, టర్కీ అన్ని వస్తువులపై 17.3, భారత దేశం సగటున16.2 సుంకాలు విధిస్తున్నాయి. అమెరికాలో సేద్యంపై ఆధారపడి జీవిస్తున్న వారు 2శాతం, యూరోపియన్ దేశాలలో కేవలం 4శాతం కాగా, చైనాలో 22 శాతం మందికి వ్యవసాయమే జీవనాధారం. అమెరికాలో వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాలను కంపెనీలు అత్యాధునిక యంత్రాలు, నూర్పిడి పరికరాలతో చేయడం వల్ల సాగు ఖర్చు తక్కువ. యూరోప్ చైనా తదితర దేశాలలో కూడా యంత్రాల వాడకము వల్ల సాగు ఖర్చు తక్కువ ఉత్పాదకత ఎక్కువ.2024లో చైనా100 బిలియన్ డాలర్లు, అమెరికా 59 బిలియన్ డాలర్ల వ్యవసాయోత్పత్తులను దిగుమతి చేసుకున్నాయి. అమెరికా భారీగా మొక్కజొన్న, పత్తి వంటి 182.8 బిలియన్ దాలర్లవ్యవసాయోత్పత్తులను ఎగుమతి చేసింది. అమెరికా, చైనా అనుభవాలను భారత ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని పోటీ తత్వాన్ని పెంపొందించుకోవాలి. పంట సీజన్లో యూరియా తదితర ఎరువులను సరఫరా చేయలేనిస్థితి భారత ప్రభుత్వానిది.మన దిగుమతులలో మూడోవంతు వంటనూనెలే. వాటిపై 10 శాతం సుంకం. పత్తిపై సున్నా, పచ్చబఠానీల పై నామమాత్రంగా సుంకాలున్నాయి.అమెరికా కోడికాళ్లపై వాల్ నట్స్ పై 100శాతం,యాపిల్స్ పై 50శాతం, పాలపొడిపై50 శాతం సుంకాలు విధిస్తున్నారు. మనదేశం అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు.బియ్యం దదిగుమతిపై 70 శాతం ఉంది. మనదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుంది కనుక అప్పటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలని భారత ప్రభుత్వ లక్ష్యానికి చేరాలంటే వివిధ రంగాలలో ఎన్నో మార్పులు తేవాలి. అమెరికా సుంకాలు ఆదేశానికి కూడా నష్టం కలిగిస్తాయని,ద్రవ్యోల్బణం పెరుగుతుందని ఆందోళనలు వక్తమవుతున్నాయి. ప్రధాని మోడీ 2019 సెప్టెంబర్ లో అమెరికాలో పర్యటించి హ్యూస్టన్ లో జరిగిన సభలో ట్రంప్‌తో కర చాలనం చేశారు. ఇతర దేశాల ఆంతరంగిక రాజకీయ వ్యవహారాలలో జోక్యం చేసుకోరాదనే నియమాన్ని పక్కన పెట్టి 'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్ అంటూ ట్రంప్ కు అనుకూ లంగా ప్రచారం చేశారు. అప్పుడు బిడెన్ గెలిచారు.అయినా సుంకాల విషయంలో రెండోసారి అధ్యక్షుడైన ట్రంప్ కరకుగా వ్యవహరిం చడమే గాక అక్కడ పనిచేస్తున్న భారతీయులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలెన్నో తీసుకున్నారు. హెచ్1బి వీసాలపై ఎన్నో ఆంక్షలు విధించాడు. భారత్ అమెరికాలలో మితవాద ప్రభుత్వాలే అధికారంలో ఉన్నా ఇప్పుడు ప్రధాని మోడీ దేశ ప్రయోజనాల కోసం గళం వినిపించక తప్పలేదు. నిజానికి ప్రచ్ఛన్న యుద్ధకాలం నుండి భారత అమెరికా సంబంధాలలో ఎన్నో ఒడిదుడుకులు తప్పడం లేదు. అమెరికా పాకిస్తాన్ పాలకులను దువ్వుతూ ఆయుధ,ఆర్థిక సాయం అందిస్తూ వస్తోంది. 1971 లో ఎన్నికయిన షేక్ ముజిబుర్ రహమాన్ కు పాక్ సైనిక పాలకులుఅధికారం అప్పగించకిపోవడం,సైనిక దమన కాండతో ఆగ్రహించిన బంగ్లా ప్రజలు విముక్తి పోరాటాన్ని ప్రారంభించగా భారత్ నైతిక మద్దతు ఇచ్చి ఆయుధ సహాయం చేసింది.లక్షలాదిమంది శరణార్థులకు ఆశ్రయమిచ్చి ఆదుకుంది. అప్పుడు అమెరికా అధ్యక్షుడుగా ఉన్న రిచర్డ్ నిక్సన్ పాక్‌కు మద్దతుగా తమ సప్తమ నౌకా దళాన్ని పంపారు. దీటుగా అప్పటి సోవియట్ యూనియన్ భారత్‌కు మద్దతుగా నిలవడంతో వెనుదిరగక తప్పలేదు. అలా యెన్నో అవాంతరాలు, విభేదాలతో నడిచిన భారత అమెరికా సంబంధాలు 2000సం.లో అప్పటి అధ్యక్షుడు క్లింటన్ భారత్ పర్యటనకు రావడముతో కొత్త మలుపు తిరిగాయి. తర్వాత అధికారములోకి వచ్చిన భారత్‌మెరికా ప్రభుత్వాలు, నేతలు కూడా యధాశక్తి చేసిన కృషితో రెండు దేశాల సంబధాలు ఈ స్థాయికి వచ్చాయి. ఇటీవల భారత దళాలు పాక్‌లోని ఉగ్రవాద స్థావరాలపై దాడిచేసి ధ్వంసం చేసినపుడు తన జోక్యంతోనే భారత్ దాడులు ఆపిందని ట్రంప్ పదే పదే కోతలు కోయగా భారత్ ఖండించింది.ఏదేశంతో సంబంధాలైనా ,వాణి జ్యమైనా పరస్పరప్రయోజానాల ప్రాతిపదికగానే జరగాలి.ట్రంప్ నిర్ణయాలు అమెరికాకు నష్టం కిలిగిస్తాయని ఆయుధ తదితరపరిశ్రమ వర్గాలు ఆందోళనవ వ్యక్తం చేయటంతో పెంటగన్ సూచనపై కంపెనీలునీలు తమకు అవసరమైన నిపుణులను ఉద్యోగాలలోకి తీసుకోవచ్చు ననీ మినహాసయింపుఇవ్వడం కొంత ఊరట.భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న చర్చలు త్వరలో ఒక కొలిక్కి రాగలవని ఆశాభా వము వ్యక్తం ఆవుతోంది. మోడీ తన మిత్రుడని, భారత్ గొప్ప దేశమని ట్రంప్ కొత్త రాగం వలపించగా,అమెరికా సహజ మిత్రదేశం అని మోడీ స్పందన. భారత్ తొలి నుండి స్వతంత్ర విదేశాంగ వాణిజ్య విధానాలను అనుసరిస్తోంది.సోవియట్ కుప్పకూలాక ఏకధ్రువ ప్రపంచంగా కొన్నాళ్ళు అమెరికా కు తిరుగులేదని ఊదరగొట్టారు.చైనాలో పుతిన్,మోడీ,షి జిన్ పింగ్ లసమావేశం తర్వాత అమెరికా తత్తరరపడి కొంత తగ్గింది. ప్రాచీన సంస్కృతి,నాగరికత గల భారత్ చైనాలు దగ్గరైతే ఉభయ తారకంగా వుంటుంది చైనాకు మన ఎగుమతులు పెంచాలి. ప్రస్తుతం దిగుమతులే ఎక్కువ. నాయకత్వం మన ప్రజల బహుళ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని దృఢంగా వ్యవరించినపుడే ,మన ఎగుమతులను వివిధ దేశాలకు విస్తరించినపుడే లక్ష లాదిమంది ఉద్యోగ ఉపా ధులను కాపాడగలం. భారత్ అన్ని రంగాలలో రానున్న కాలము లో అభివృద్ధి చెందిన దేశంగా ఎదగ డానికి ఎంతో శ్రమించాల్సివుంది.

# బధిరులకు వరంగా 'సైన్ లాంగ్వేజ్'!

హైదరాబాద్,సంజ్ఞ లేదా సంకేత భాష చెవిటి వారికి చదువు నేర్చుకోవడానికి, సమాచార వితరణకు, అభిప్రాయాలను వ్యక్తం చేయడానికి, మన ప్రత్యేకతను చాటు కోవడానికి, సమ్మిళిత అభివృద్ధికి మహా వరంగా మారింది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 300 వరకు సంజ్ఞ భాషలు లేదా సైన్ లాంగ్వేజెస్ ఉన్నాయి. సంజ్ఞ భాషలకు ప్రత్యేక పదకోశం, విలక్షణ వ్యాకరణం ఉంటాయి. సంజ్ఞ భాషలకు ప్రధాన ఉదాహరణలుగా భారతీయ, అమెరికన్, బ్రిటీష్ సంకేత భాషలు వస్తాయి. సంజ్ఞ భాష వ్యక్తీకరణ కు ముఖ కవళికలు, బాడీ లాంగ్వేజ్లు ప్రధానమైనవిగా గుర్తించబడ్డాయి. సంజ్ఞ భాషను నేర్చుకోవడం ద్వారా వినికిడి లోపం కలిగిన అభాగ్య దివ్యాంగుల సమస్యలు అర్థం చేసుకోవడంతో పాటు వారి పట్ల సహానుభూతి పెరుగుతుంది.ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 72 మిలియన్ల చెవిటి దివ్యాంగులు ఉన్నారు. సహజ సిద్ధమైన సంజ్ఞ భాషల పట్ల సాధారణ ప్రజల్లో అవగాహన చాలా తక్కువగా కనిపిస్తుంది. చెవిటి వారు ప్రజలతో మమేకం కావడం, ప్రయాణాలు చేయడం, విద్యాభ్యాసం, కమ్యూనికేషన్ చేయడం, సమావేశాలకు హాజరు కావడం లాంటి సందర్భాలకు సంకేత భాష ప్రయోగించబడుతుంది. చెవిటి తనకంతో బాధ పడుతున్న ప్రజలు ప్రజలతో మమేకం కావడానికి సంజ్ఞ భాష ఓ అద్భుత వరంగా మారింది. సంజ్ఞ భాష ప్రాధాన్యం గుర్తించిన ఐరాస 2017లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 23 సెప్టెంబర్ రోజున అంతర్జాతీయ సంజ్ఞ భాష దినం (ఇంటర్నేషనల్ డే ఆఫ్ సైన్ లాంగ్వేజెస్)ను పాటించడం జరుగుతున్నది.చెవిటి వ్యక్తులు, ముఖ్యంగా వినికిడిలోపం కలిగిన యువతకు సంజ్ఞ భాష ప్రాధాన్యం వివరిస్తూ, వారికి ఈ భాషను నేర్పడం విధిగా జరగాలి. స్థానిక స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు చెవిటి ప్రజల సమస్యలను చర్చిస్తున్న వేదికల సమన్వయంతో సంజ్ఞ భాషను ఉపయోగించడం, అభివృద్ధి చేయడం, ప్రచారం చేయడం కొనసాగుతున్నది. వినికిడిలోపం కలిగిన ప్రజలను సాధారణ జనజీవన ప్రవంతిలో కలిసి పోవడానికి సంజ్ఞ భాష ఉపకరిస్తున్నది. అంతర్జాతీయ సంజ్ఞ భాషల దినం-2025 ఇతివృత్తంగా ప్రజలకు ఐక్యం చేస్తున్న సంజ్ఞ భాష(సైన్ లాంగ్వేజ్ యునైట్స్ అజ్) అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహి స్తున్నారు. ఈ దినోత్సవ వేదికల్లో అవగాహన కలిపించడం, చెవిటి నిపుణుల ప్రసంగాలు ఏర్పాటు చేయడం, సంజ్ఞ భాష గూర్చి తెలుసుకోవడం, సైన్ లాంగ్వేజ్ క్లబ్బులు ఏర్పాటు చేయడం లాంటివి నిర్వహిస్తారు.సాధారణ పౌర సమాజంతో చెవిటి వారిని అనుసంధానించడానికి సంజ్ఞ భాషలు చక్కగా ఉపయోగపడుతున్నాయి.



మాటల్లో చెప్పలేని అద్భుత భావాలను సంజ్ఞలతో వ్యక్తం చేయడం ఓ అపురూప సందర్భం. సంజ్ఞ భాష ఒక కమ్యూనికేషన్ సాధనమే కాదు, అది రెండు హృదయాల కలయిక అవి తెలుసుకోవాలి. అందరితో సమానం గా విద్యను అభ్యసించడానికి సంజ్ఞ భాష దోహదపడుతున్నది. వినికిడా లోప దివ్యాంగుల మానవ హక్కుల పరిరక్షణలో సంజ్ఞ భాషలు సదా ఉపయోగపడుతున్నాయి. అన్ని అవయవాలు చక్కగా ఉన్న సంజ్ఞ భాషలోని మౌళిక అంశాలను చేర్చుతొని, ఆ వర్గం ప్రజలతో సరదాగా మాట్లాడుదాం, మేం ఉన్నామన్న ధైర్యాన్ని అందిద్దాం.

# తల్లికి వందనపై మండలిలో వాడీవేడి చర్చ

అమరావతి,తల్లికి వందనం పథకంపై వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి నారా లోకేష్ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మంగళవారం శాసనమండలి సమావేశాల ప్రశ్నోత్తరాల్లో భాగంగా తల్లికి వందనం లబ్ధిదారులు ఎంతమంది అంటూ శాసనమండలిలో వైసీపీ సభ్యులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. అమ్మఒడి రాలేదు తల్లికి వందనం వస్తోందంటూ వైసీపీ ఎమ్మెల్సీలకు మంత్రి కౌంటర్ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పేరిట కొందరికే పథకాన్ని పరిమితం చేశారని విమర్శించారు. తల్లికి వందనం కింద కూటమి ప్రభుత్వం ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికీ రూ.15వేలు ఇస్తోందని లోకేశ్ వివరించారు. పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్ వాడీ వర్కర్లకు తల్లికి వందనం వర్తించట్లేదని మండలి చైర్మన్ అడిగారు. అందరికీ వర్తించేలా జీవో లేదా మెమో ఉందా అని మంత్రిని ప్రశ్నించారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం వర్తించేలా జీవో ఉందంటూ జీవోలోని అంశాన్ని ఛైర్మన్‌కు చదివి వినించారు.

# సింగరేణి అభ్యున్నతికి కృషి

పెద్దపల్లి,సింగరేణి సంస్థ లాభాల్లో ఉండడానికి దివంగత నేత, తన తండ్రి కాకా వెంకటస్వామి కారమణని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కాకా నుంచి తన తనయుడి వరకు సింగరేణి ఉన్నతికి కృషి చేస్తున్నారని అన్నారు. మంగళవారం పెద్దపల్లి పట్టణంలోని శాంతి నగర్ ఏరియాలో ఉన్న దుర్గా మాత మండపంలో మంత్రి వివేక్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్‌కి ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లి నియోజకవర్గ ప్రజలు, రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. 1995లో సింగరేణి నష్టాల్లోకి వెళితే ఆనాటి కేంద్ర మంత్రి, తన తండ్రి కాకా వెంకటస్వామి ప్రధానిని ఒప్పించి సింగరేణికి రూ.10 వేల కోట్లు- సహకారం అందించారని గుర్తు చేశారు. ఇవాళ సింగరేణి లాభాల్లో ఉందంటే దానికి కారణం కాక వెంకటస్వామి అని అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం కాకా వెంకటస్వామి నుంచి తన కుమారుడు, ఎంపీ గడ్డం వంశీ కృష్ణ వరకు కృషి చేస్తున్నారని చెప్పారు. తాను పెద్దపల్లి ఎంపీగా ఉన్న కాలంలో రామగుండం ఫెర్టిలైజర్ కంపెనీ మూతపడితే.. దానిని తెరిపించడం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రూ.6 వేల కోట్ల ఆర్థిక సహాయం అందేలా చూశాననిగుర్తు చేశారు.

# గతప్రభుత్వ అక్రమ కేసుల పరిష్కారం

అమరావతి,ఉద్యోగులు, ఉపాధ్యాయులు సహా అంగన్వాడీలు, ఆశావర్కర్లు తదితరులపై గత వైకాపా ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులను త్వరగా పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హోంమంత్రి అనిత అన్నారు. పోలీసు, లా డిపార్టుమెంట్‌తో సమన్వయం చేసుకుంటూ కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. సీపీఎస్ రద్దు కోరుతూ టీచర్లు ఆందోళనకు దిగితే 149 కేసులు పెట్టారని.. ఇప్పటి వరకు 80 శాతం కేసులను ఎత్తివేశామన్నారు. మిగిలినవాటినీ త్వరలో తొలగిస్తామన్నారు. 2019-24 మధ్య కాలంలో తప్పుడు క్రిమినల్ కేసుల పరిష్కారంపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల్లో జనసేన ఎమ్మెల్సీ నాగబాబు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇచ్చారు. గత ప్రభుత్వం చాలా మందిపై అక్రమ కేసులు పెట్టిందని మంత్రి అన్నారు. అమరావతి రైతులు రాజధానిని కోరుకుంటే వందలాది మందిపై కేసులు పెట్టారన్నారు. గత ప్రభుత్వం తనపైనా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ- కేసులు పెడితే కడప కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. చీకటి జీవోలు తెచ్చే సంస్కృతి కూటమి ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. రికార్డులు, లా ప్రకారం కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. అయితే మంత్రి అనిత సమాధానంపై వైసిపి భ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు సభనుంచి వాకౌట్ చేశారు.

# వైసీపీలో కొత్త పంచాయతీ ?

అమరావతి,వైఎస్ఆర్‌సీపీ పెద్దల్లో బొత్స సత్యనారాయణ వ్యవహారశైలిపై అసంతృప్తి పెరుగుతోంది. ఆయన తీరు జగన్ ను ఇబ్బంది పెట్టేలా ఉందని ..ఉద్దేశపూర్వకంగా జగన్ కు సమస్యలు సృష్టించేందుకు బొత్స కుట్ర చేస్తున్నారని అనుమానిస్తున్నారు. శాసనమండలిలో జరుగుతున్న పరిణామాలే దీనికి నిదర్శనంగా భావిస్తున్నారు.

జీఎస్టీ తీర్మానాన్ని వ్యతిరేకించిన బొత్స

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జీఎస్టీ సంస్కరణల విషయంలో వైసీపీ స్టాండ్ చాలా క్లియర్ గా ఉంది. జగన్ రెడ్డి జీఎస్టీ సంస్కరణలపై ఆహా..ఓహో అని ట్వీట్ చేశారు. కానీ బొత్స మండలిలో జీఎస్టీ అమలు విషయంలో కేంద్రాన్ని ప్రశంసిస్తూ చేస్తున్న తీర్మానాన్ని వ్యతిరేకిస్తామని ప్రకటించారు. బీఏసీ సమావేశంలో ఈ విషయం ఆయన చెప్పడంతో అందరూ ఆశ్చర్యపోయారు. సభలో ఆయన వ్యతిరేకిస్తారని అనుకున్నారు. కానీ ఆయన వ్యతిరేకించబోతున్నారని తెలిసి.. పై నుంచి ఒత్తిడి రావడంతో.. వ్యతిరేకించలేదు. అలాగని.. సమర్థించలేదు. చివరికి బొత్స ఎక్కడ కొంప ముంచుతారో అని మండలి చైర్మన్ పాస్ అయినట్లుగా ప్రకటించారు.

జగన్ గుండెల్లో రాయి వేసిన బొత్స

జగన్ రెడ్డి పరిస్థితి అత్యంత ఘోరంగా ఉంది. ఆయన బీజేపీ కాళ్లు పట్టుకుని వదిలే పరిస్థితి లేదు. వారికి ఏ చిన్న కోపం తెప్పించినా తాను జైల్లోనే ల్యాండ్ అవుతారు . తాను చేసిన నేరాలు, ఘోరాల విషయంలో ఎంతగా పట్టుకుని ఆపుతున్నారో ఆయనకు తెలిసినంతగా ఎవరికీ తెలియదు. అందుకే కేంద్రం వైపు నుంచి ఏం చేసినా ఆహా..ఓహో అంటున్నారు. దానికి తగ్గ ప్రయోజనాలు పొందుతున్నారు. కానీ అవన్నీ తాత్కాలికమైనవే. అవే ఆయనను బయట ఉండేలా చేస్తున్నాయి. ఇదంతా తెలిసి కూడా బొత్స జీఎస్టీ సంస్కరణలను పొగడకుండా వ్యతిరేకిస్తామని చెప్పడం.. అసలు సమర్థించకపోవడం వైసీపీ అధినేత జగన్ లో అసహనానికి కారణం అవుతోంది.

బొత్స జగన్ పై కుట్ర చేస్తున్నారా ?

బొత్స వ్యవహారం వైసీపీలో అనేక రకాల చర్చలకు కారణం అవుతోంది. ఆయన ఇటీవలి తీరు జగన్ ను అవమానించేలా ఉందని అనుకుంటున్నారు. షర్మిలతో ఆత్మీయంగా ముచ్చట్లు, రఘురామ వంటి వారితో రాసుకునిపూసుకుని తిరగడం వంటివి జగన్ కు కొత్త అనుమానాలు రేకెత్తించేలా ఉన్నాయి. మండలిలో ఆయన తీరు కూడా జగన్ కు నచ్చడం లేదు. శాసనమండలి చేతుల్లో ఉన్నా ప్రభుత్వాన్ని కనీసం ఇబ్బంది పెట్టలేకపోతున్నారని ఆయన అనుకుంటున్నారు. త్వరలో బొత్సకు .. జగన్ రెడ్డి తానేంటో చూపించే అవకాశం ఉందన్న ప్రచారం జరుగుతోంది.

# దేశంలోనే తెలంగాణ టాప్!

హైదరాబాద్, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అప్పులు అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వంతో పాటు కార్పొరేషన్ల ద్వారా ఇబ్బడి ముబ్బడిగా అప్పులు తీసుకుని రాష్ట్రం కోలుకోని విధంగా దిగజార్చారనే విమర్శలు ఉన్నాయి. ఈ విమర్శలను నిజం చేస్తూ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) తాజాగా నివేదిక విడుదల చేసింది. తెలంగాణలో మార్చి 2023 నాటికి స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ)లో తీసుకున్న అప్పుల శాతాన్ని కాగ్ వెల్లడించింది. మొత్తం జీఎస్డీపీలో తెలంగాణ ప్రభుత్వం అప్పులు 15.03 శాతం ఉండగా, సిక్కిం (11.21%) రెండో స్థానంలో, పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (10.61%) మూడో స్థానంలో ఉండటం విశేషం. రుణాల గ్యారెంటీలో తెలంగాణ మొదటి స్థానంలో ఉండగా మన పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రెవెన్యూ లోటులో దేశంలోనే తొలి స్థానంలో ఉంది. ఏపీలో రెవెన్యూ లోటు 3.30 శాతం ఉండగా ఎన్డీఏ భాగస్వామ్య ప్రభుత్వం కావడంతో కేంద్ర ప్రభుత్వం దయతలిచింది. రెవెన్యూ లోటు పూడ్చేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రాంట్లు మంజూరు చేసింది.

రుణాల గ్యారెంటీలో దేశంలోనే టాప్ తెలంగాణ

2023 మార్చి 31వ తేదీ నాటికి దేశంలోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తమ స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ)లో 3.91 శాతం అనగా రూ.10 లక్షల 14 వేల 319 కోట్ల కు వివిధ ఆర్థిక సంస్థలకు గ్యారెంటీలు ఇచ్చాయి. ఆర్థిక సంస్థల నుంచి తీసుకున్న రుణాలకు గ్యారెంటీలు ఇచ్చిన వాటిలో ప్రభుత్వ సంస్థలు, పబ్లిక్ సెక్టర్ కంపెనీలు, స్పెషల్ పర్పస్ వెహికిల్స్ ఉన్నాయి.

# భారత్ తో సంబంధాలు కీలకం...



అమెరికా,అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్‌ల మధ్య జరిగిన కీలక భేటీ భారత్–అమెరికా సంబంధాలలో ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికినట్టు కనిపిస్తోంది. గతంలో ఇరు దేశాల మధ్య వాణిజ్య సుంకాలు, రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు వంటి అంశాలపై తలెత్తిన విభేదాల నేపథ్యంలో ఈ సమావేశం మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇది కేవలం ఒక దౌత్యపరమైన భేటీ మాత్రమే కాదు, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను తగ్గించి, సహకారాన్ని పెంపొందించేందుకు ఉన్న బలమైన సంకల్పాన్ని సూచిస్తుంది.

వాణిజ్యం, రక్షణ, అంతర్జాతీయ సహకారం

ఈ సమావేశంలో వాణిజ్యం, రక్షణ, ఔషధాలు వంటి కీలక రంగాలపై చర్చలు జరిగాయని రూబియో స్పష్టం చేశారు. ఈ రంగాలు ఇరు దేశాల ఆర్థిక, భద్రతాపరమైన ప్రయోజనాలకు అత్యంత కీలకమైనవి. ముఖ్యంగా భారత్–అమెరికా వాణిజ్య సంబంధాలు కొంత కాలంగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. దీనికి ప్రధాన కారణం అమెరికా విధించిన భారీ సుంకాలు. ఈ నేపథ్యంలో భవిష్యత్‌లో వాణిజ్య సంబంధాలను మెరుగుపరిచేందుకు మార్గం సుగమం కావచ్చని ఈ భేటీ సూచిస్తోంది. అలాగే, క్వాడ్ కూటమిలో కలిసి పనిచేయాలనే నిర్ణయం ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భద్రత, స్థిరత్వాన్ని పెంపొందించడంలో ఇరు దేశాల మధ్య ఉన్న ఉమ్మడి లక్ష్యాన్ని ప్రతిబింబిస్తుంది. చైనా పెరుగుతున్న ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి, ఈ ప్రాంతంలో స్వేచ్ఛాయుత వాణిజ్యాన్ని, ప్రయాణాన్ని ప్రోత్సహించడానికి ఈ కూటమి అత్యంత కీలకమైనది.

లిభవిష్యత్తుపై సానుకూల సంకేతాలు

ఈ భేటీ తర్వాత ఇరు దేశాల మంత్రులు వ్యక్తం చేసిన సానుకూల అభిప్రాయాలు, భవిష్యత్తులో కూడా నిరంతర సంప్రదింపులు కొనసాగించాలని తీసుకున్న నిర్ణయం, సంబంధాలు మరింత మెరుగుపడతాయని స్పష్టమైన సంకేతాలను ఇస్తున్నాయి. ట్రంప్ పరిపాలనలో తలెత్తిన కొన్ని గందరగోళాలను, విభేదాలను అధిగమించి,ఇరు దేశాలు తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని తిరిగి బలపరుచుకోవాలని కోరుకుంటున్నాయి. అమెరికాకు భారత్‌తో సంబంధాలు అత్యంత కీలకం అని రూబియో స్వయంగా పేర్కొనడం, కేవలం వాణిజ్యపరమైన ప్రయోజనాలే కాకుండా,భౌగోళిక రాజకీయ ప్రాముఖ్యతను కూడా నొక్కి చెబుతుంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక శక్తిగా,భారత్ ఇప్పుడు అమెరికాకు ఒక అనివార్యమైన భాగ స్వామి. ఈ భేటీ ద్వారా ఇరు దేశాల మధ్య విశ్వాసం పునరుద్ధరించబడి, భవిష్యత్తులో మరింత బలమైన సహకారం నెలకొంటుందని నిపుణులు ఆశిస్తున్నారు.

# జీఎస్టీ 2.0తో ధరల తగ్గింపు లేదంటూ ఫిర్యాదులు...

న్యూఢిల్లీ,జీఎస్‌టీ సంస్కరణలు అమల్లోకి రావడంతో నిత్యావసరాల నుంచి కార్ల వరకు పన్నుల భారం తగ్గి, కొనుగోలుదార్లకు భారీగా సొమ్ము ఆదా కానుంది. జీఎస్టీ 2.0 అమల్లోకి వచ్చినప్పటికీ కొన్ని ఈ–కామర్స్ వేదికలు ఆ ప్రయోజనాలను బదిలీ చేయడం లేదంటూ ఫిర్యాదులు వస్తున్నాయి వీటిపై కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. ఈ ఫిర్యాదులపై ఆరా తీస్తున్నట్లు వెల్లడించాయి. "ధరల మార్పును పర్యవేక్షిస్తున్నాం. ఈ ఫిర్యాదులపై ఇప్పుడే స్పందించలేం. సెప్టెంబర్ 30లోగా క్షేత్రస్థాయిలో జీఎస్టీ అమలుపై నివేదిక అందనుంది" అని పేర్కొన్నాయి. సెప్టెంబర్ ప్రారంభంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌అధ్యక్షతన జరిగిన జీఎస్టీ పాలకమండలి 56వ సమావేశంలో 12%, 28% పన్ను శ్లాబులను తొలగించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 5%, 18% శ్లాబులను కొనసాగిస్తున్నారు. ఈ జీఎస్టీ 2.0 సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చింది. దాంతో కిరాణా సరకులపై కుటుంబ ఖర్చులు 13% తగ్గనుండగా, ఒక చిన్న కారు కొనుగోలు చేస్తే దాదాపు రూ.70,000 వరకు ఆదా కానుంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం.. స్టేషనరీ, దుస్తులు, పాదరక్షలు, ఔషధాలపై ఖర్చులు 7–12% తగ్గనున్నాయి. వ్యక్తిగత ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై ఉన్న 18% పన్నును తొలగించడంతో.. ఈ మేరకు ఆదా కానుంది. మొత్తం 375 రకాల వస్తువులపై జీఎస్‌టీ రేట్లు తగ్గాయి. ఈ నేపథ్యంలో జీఎస్టీ కొత్త శ్లాబుల అమలు సరిగా జరుగుతుందా లేదా? అని




పరిశీలించేందుకు ప్రత్యేకంగా వ్యవస్థను ఏర్పాటు చేయకపోయినా.. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌లను కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు గమనిస్తోంది. ఇప్పటికే పలు సంస్థలు పన్ను కోతలతో వచ్చే ప్రయోజనాలను వినియోగదారులకు అందిస్తామని ప్రకటించాయి. కాగా.. దాదాపుగా వ్యక్తిగత వస్తువులన్నింటికీ పన్ను తగ్గించడం ద్వారా దేశీయ వినిమయాన్ని పెంచి.. అమెరికా సుంకాల భారం నుంచి కొంత ఉపశమనం పొందాలని ప్రభుత్వం భావిస్తోంది. దేశీయ వాణిజ్యాన్ని పరుగు పెట్టించేందుకు, వినియోగాన్ని గణనీయంగా ప్రోత్సహించే దిశగా నిర్ణయాలు తీసుకున్న జీఎస్‌టీ మండలి.. పండగ సీజన్‌ను మరింత ఉత్సాహభరితంగా మార్చింది.

# బతికి ఉన్నవారిని చూడండి.. చనిపోయిన వారి విగ్రహాలు తర్వాత...

న్యూఢిల్లీ,బహిరంగ ప్రదేశాల్లో నేతల విగ్రహాలు ఏర్పాటు చేయడం అనేది కామనే. అయితే.. ఇటీవల కాలంలో ఈ విషయంపై ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. విగ్రహాలకు ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంపట్ల.. చాలా మంది అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇదేసమయంలో పేదలకు అన్నం.. అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని సామాజిక ఉద్యమకారులు కూడా ఆక్షేపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. "బతికి ఉన్నవారిని పట్టించుకుని.. ముందు వారి ఆకలి తీర్చండి. చనిపోయిన వారికి తర్వాత విగ్రహాలు పెట్టవచ్చు. వారిని సంతృప్తి పరవచ్చు." అని వ్యాఖ్యానించింది. అంతేకాదు.. నేతలను కీర్తించేందుకు.. ఓటు బ్యాంకులు పెంచుకునేందుకు ప్రజాధనాన్ని ఎలా వినియోగిస్తారని కూడా ప్రశ్నించింది. ఈ విషయంలో ప్రభుత్వాలు ఆలోచన చేయకపోతే.. తామే నిర్ణయం వెలువరించాల్సి ఉంటుందని కూడా సుప్రీంకోర్టు ఘాటుగా వ్యాఖ్యానించింది. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్‌లో గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన మాయావతి ఏనుగు విగ్రహాల ఏర్పాటును కోర్టు గుర్తు చేయడం గమనార్హం.

విషయం ఏంటి?

తమిళనాడు అంటేనే నేతల విగ్రహాలకు.. ప్రచారానికి ప్రధాన ప్రాధాన్యం ఇస్తారు. గతంలో అధికారంలో ఉన్న జయలలిత.. వీధికో విగ్రహం పెట్టే ప్రయత్నం చేసినప్పుడు హైకోర్టు అడ్డుకుంది. ఆ తర్వాత.. వచ్చిన అన్నాడీఎంకే ప్రభుత్వం ప్రధాన కూడళ్లపె విగ్రహాలు ఏర్పాటు చేసింది. అయితే.. తాజాగా డీఎంకే ప్రభుత్వం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ సీఎం కరుణానిధి విగ్రహాలను కూడా



ఏర్పాటు చేసేందుకు రెడీ అయింది. అయితే.. ఇది కొన్నాళ్లుగా వివాదంగా మారింది. ముఖ్యంగా తిరునెల్వేలి జిల్లాలోని వల్లియూర్ వెజిటేబుల్ మార్కెట్ ప్రవేశద్వారం వద్ద కరుణానిధి కాంస్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నించడం.. తీవ్ర విమర్శలకు, వివాదానికి కూడా దారితీసింది. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో కొన్నాళ్ల కిందట కోర్టు అడ్డుకుంది. విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వాలు జీవోలు జారీ చేయడాన్ని కూడా తప్పుబట్టింది. దీనిని సీఎం స్టాలిన్ సర్కారు సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. తాజాగా మంగళవారం ఈ పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు.. కోర్టు పైవిధంగా వ్యాఖ్యలు చేసింది. మద్రాసు హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఏదైనా ఉంటే అక్కడే తేల్చుకోవాలని సూచించింది.

# మండలిలో అదరగొట్టిన జనసేన ఎమ్మెల్సీ



అమరావతి,జనసేన ఎమ్మెల్సీగా తొలిసారి శాసనమండలిలోకి అడుగుపెట్టిన ఎమ్మెల్సీ నాగేంద్రబాబు అదరగొట్టారు. ఎమ్మెల్సీగా ఎన్నికై దాదాపు మూడు నెలలు కావస్తున్నా, మండలిలో అడుగు పెట్టే అవకాశం తాజా సమావేశాల్లోనే దక్కించుకున్న నాగబాబు.. ఈ రోజు తొలిసారిగా చర్చలో పాల్గొన్నారు. సభలో అధికార, విపక్షాల మధ్య వాడివేడిగా విమర్శలు, ప్రతివిమర్శలు జరిగినా, వాటి జోలికి వెళ్లని జనసేనాని పవన్ సోదరుడు.. ఎమ్మెల్సీగా తనకు వచ్చిన తొలి అవకాశానికి 'సత్వర న్యాయం' చేశారన్న ప్రశంసలు అందుకుంటున్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోదరుడు కొణిదల నాగబాబు ఎమ్మెల్సీ హోదాలో మంగళవారం శాసనమండలిలో ప్రసంగించారు. ఈ నెల 18న శాసనమండలి సమావేశాలు ప్రారంభం కాగా, తొలి మూడు రోజులు సభలో మాట్లాడే అవకాశం నాగబాబుకు దక్కలేదు. మంగళవారం ఈ చాన్స్ రావడంతో కోర్టుల్లో పెండింగ్ కేసులపై ఆయన మాట్లాడారు. ముందుగా సభాధ్యక్షుడితోపాటు ప్రధాన ప్రతిపక్ష నేత, మంత్రులు, ఇతర సభ్యులకు ధన్యవాదాలు చెప్పిన నాగబాబు ఆలస్యంగా అందే న్యాయం వల్ల ఎన్నో విపరిణామాలు చోటుచేసుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా కోర్టుల్లో 3.30 కోట్ల కేసులు పెండిగులో ఉన్నాయని, అందులో ఏపీలోనే లక్షకు పైగా కోర్టు కేసులు సుదీర్ఘకాలంగా వాయిదాలు పడుతున్నట్లు నాగబాబు సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలో పెండింగులో ఉన్న కేసుల్లో 75 శాతం ఏడాదికి పైగా, మిగిలిన కేసులు మూడేళ్లకు పైగా పెండింగులో ఉండటం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేనీ కేసులో తనకు న్యాయం చేయాలంటూ కోర్టు మెట్లు ఎక్కే వ్యక్తికి సకాలంలో న్యాయం అందించలేకపోతే అతడిని బాధితుడిగా చేసినట్లు భావించాలని అన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన ఓ వ్యక్తి దొంగతనం కేసులో ఆరేళ్ల పాటు ఎటువంటి విచారణ లేకుండా జైలులో ఉండిపోయాడని, ఆ తర్వాత ఆయన నేరం చేయలేదని కోర్టు తీర్పునిచ్చిందని అన్నారు. ఈ కేసులో అతడు ఆరేళ్ల కాలాన్ని మనం తిరిగి తేలేమన్న విషయాన్ని గుర్తించాలని నాగబాబు లేవనెత్తారు. ఇక ఆయన ప్రసంగం విన్న వారు మండలిలో ఇటువంటి అంశం చర్చకు రావడాన్ని ప్రత్యేకంగా పరిగణిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అసెంబ్లీ, శాసన మండలిలో ప్రజా సమస్యలు బదులుగా ఇతర అంశాలే ఎక్కువగా ప్రస్తావనకు వస్తున్నాయని, కానీ అందరిలో భిన్నంగా నాగబాబు సబ్జెక్టును ఎంచుకున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. అంతేకాకుండా న్యాయం అందడంలో ఆలస్యం వల్ల బలైపోయే బడుగుల గొంతును ఆయన వినిపించడం కూడా ఆకట్టుకుందని అంటున్నారు. సహజంగా ఇలాంటి చర్చ అసెంబ్లీ, మండలి, లోక్ సభలో జరగడం ప్రస్తుత కాలంలో అరుదుగా మారిపోయింది. రాజ్యసభలో అప్పుడప్పుడు ఇలాంటి సబ్జెక్టులు చర్చకు వచ్చినా, ఎలాంటి ప్రభావం చూపలేకపోతున్నాయనే అభిప్రాయం ఉంది. ఏదిఏమైనా న్యాయవ్యవస్థలో ఉన్న లొసుగులను ప్రస్తావించడం ద్వారా నాగబాబు తొలి ప్రయత్నంలోనే ధైర్యం చాటుకున్నారని అభినందనలు అందుకుంటున్నారు.

# నల్లగొండ గడ్డ... కాంగ్రెస్ అడ్డా...



హైదరాబాద్,నల్లగొండ గడ్డ అంటేనే కాంగ్రెస్ పార్టీకి అడ్డా అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ కండువా మోసే నిఖార్సైన కార్యకర్తలే పార్టీకి బలమని, మీరే నా లీడర్లు, మీరే నా క్యాడర్లు, మీరే నా బలం, బలగమని ఆయన తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏసమయంలోనైనా తోడుగా నా వెన్నంటే ఉంటూ 30 ఏళ్లుగా నన్ను అక్కున చేర్చుకున్నారని, ఏమిచ్చినా మీ రుణం తీర్చలేనిదని కోమటిరెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు. అభివృద్ధిలో నల్లగొండ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలుపుతానని తెలిపారు. ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేర్చే బాధ్యత మీదేనని అన్నారు. గ్రామీణ రోడ్లు అన్నింటినీ డబుల్ రోడ్లుగా మారుస్తా.. విద్యా, వైద్యంలో ఇంకా మెరుగైన సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రోడ్లు, కాలువలు, కాలేజీలు, హాస్పిటల్స్, ప్రాజెక్టులు ఏది చూసినా నల్లగొండ మోడల్ అనేలా చేస్తానని మాటిస్తున్నానన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి నల్లగొండ వ్యాప్తంగా 100శాతం కాంగ్రెస్ పార్టీ జెండా రెపరెపలాడాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్ఎస్ పార్టీ నాలుగు ముక్కలు అయింది.. అది మునిగిపోయే నావా అని నేను ఎప్పుడో చెప్పానన్నారు. ఈ జిల్లాలో ఓ లిల్లీపుట్ ఉన్నాడు, ఎప్పుడూ గెలిచిన రెండు వేల లోపు మెజార్టీనేనని ఇక మళ్ళీ గెలవడని మాజీ మంత్రి జగదీష్ రెడ్డని ఉద్దేశించి మంత్రి వెంకట్ రెడ్డి ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమైతుందని మంత్రి వెల్లడించారు.

# విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రులు

విజయవాడ,శరన్నవరాత్రి మహోత్సవాల్లో రెండో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. సమస్త దేవతా మంత్రాలకు గాయత్రీ మంత్రంలో అనుబంధం ఉంది. అందుకే ఆయా దేవతల మూల మంత్రాలతో గాయత్రిని చేర్చి 'రుద్రగాయత్రి', 'లక్ష్మీగాయత్రి', 'విష్ణుగాయత్రి' అని గాయత్రీ మంత్రంతో సంప్రోక్షణ చేసిన తర్వాతే ఆయా దేవతలకు నివేదన చేస్తారు. సకల మంత్రాలకి మూలమైన శక్తిగా, వేదమాతగా ప్రసిద్ధి పొందిన గాయత్రీదేవి ముక్తా, విద్రుమ, హేమ, నీల, ధవళ వర్ణాలతో ప్రకాశిస్తూ, పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్టానదేవత. ఆ తల్లి అధిష్టాన దేవత సూర్యభగవానుడు. కాబట్టి గాయత్రీ అమ్మవారిని దర్శించుకోవడం వల్ల సూర్యుడు అనుగ్రహంతో ఆరోగ్యం లభిస్తుందని నమ్మిక. ప్రాతఃకాలంలో గాయత్రి గాను, మధ్యాహ్న కాలంలో సావిత్రి గాను, సాయంసంధ్యలో సరస్వతి గాను ఆమె భక్తుల పూజలు అందుకుంటుంది. గాయత్రీ ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుందనీ, గాయత్రీ మంత్ర జపం చతుర్వేద పారాయణ ఫలితాన్ని ఇస్తుందనీ పురాణాలు చెబుతున్నాయి. వరదాభయహస్తాలతో సకల వేద స్వరూపమైన గాయత్రీదేవిని ఆదిశంకరులు అనంతశక్తి స్వరూపంగా అర్చించారు. గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ దుర్గమ్మను ధ్యానిస్తే సకల మంత్ర సిద్ధి, బ్రహ్మజ్ఞానం కలుగుతాయని, పూజించిన వారికి సద్బుద్ధులు కలుగుతాయని,. పాపాలు నశిస్తాయని, అజ్ఞానం తొలగిపోతుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం రోజున ఇంద్రకీలాద్రిపై కొలువైన కనక దుర్గమ్మ శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తోంది. దేవీ నవరాత్రులలో రెండవ రోజు ఆశ్వయుజ శుక్ల తదియ నాడు కదంబవనవాసిని అయిన ఆ పరమేశ్వరి శ్రీ గాయత్రీ దేవి



అలంకారంలో భక్తులతో పూజలను అందుకుంటుంది. విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ కనక దుర్గమ్మ నవరాత్రులలో రెండో రోజున చతుర్వేద స్వరూపమైన శ్రీ గాయత్రీ దేవి అలంకారంలో కాషాయం రంగు లేదా కనకాంబరం చీర ధరించి అత్యంత సుందరంగా భక్తులకు దర్శనం ఇస్తుంది. ఇంద్రకీలాద్రిపై గాయత్రి దేవిగా దర్శనం ఇస్తున్న దుర్గమ్మ దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. తెల్లవారు జామున 3 గంటల నుంచే దర్శనాలు ప్రారంభం అయ్యాయి. కాగా దసరా నవరాత్రులలో మొదటి రోజు భక్తజనం విశేషం గా తరలివచ్చారు. 60 వేల మందికి పైగా భక్తులు బాల త్రిపురసుందరి దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. తొలిరోజు పలు రకాల సేవల, దర్శన టికెట్ల రూపేణా రూ. 22 లక్షల 72 వేల 214 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ సిబ్బంది చెప్పారు.

# మండలిలో మంటలు: బొత్స వర్సెస్ లోకేష్!

అమరావతి,ఏపీ శాసన మండలిలో మాటల మంటలు రేగాయి. అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. వాస్తవానికి అసెంబ్లీకి రాకపోయినా.. వైసీపీ తన బలం ఎక్కువగా ఉన్న మండలికి మాత్రం వస్తోంది. ఈ నేపథ్యంలో తాజాగా మంగళవారం మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణకు.. మంత్రి నారా లోకేష్‌కు మధ్య మాటల మంటలు రేగాయి. ముఖ్యంగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంటుపై కొన్నాళ్లుగా ప్రశ్నలు సంధిస్తున్న వైసీపీ తాజాగా మండలిని దీనికి వేదిక చేసుకుంది. తొలుత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంటు చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోందన్నారు. దీంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు అయినా.. లేదని బొత్స వ్యాఖ్యానించారు. ఫీజు రీయింబర్స్‌మెంటు సొమ్ములను కూడా ఇతర పథకాలకు మళ్లిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్‌తో బొత్స వాగ్వాదానికి దిగారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్న బొత్స వ్యాఖ్యలను పయ్యావుల ఖండించారు. అనంతరం.. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ.. బొత్స చేసిన విమర్శలను వెనక్కి తీసుకోవాలని, లేదా రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎప్పుడు కావాలంటే అప్పుడు చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి అన్నారు. ఏ విషయంపైనా చర్చించేందుకు తాము రెడీ అంటూ.. వైసీపీ సభ్యులకు సవాల్ రువ్వారు. వైసీపీ హయాంలోనే విద్యార్థులకు సరిగా ఫీజు రీయింబ ర్స్‌మెంటు చేయలేదని లోకేష్ వ్యాఖ్యానించారు. "మీరు తప్పులు చేసి.. మాపై నిందలు



మోపుతున్నారా?" అంటూ నారా లోకేష్ ప్రశ్నించారు. వైసీపీ హయాంలో ఎవరెవరికి ఎంత మేరకు బకాయి పెట్టారో అందరికీ తెలుసునని.. అవసరం అయితే గణాంకాలతో సహా వివరించేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని తెలిపారు. సభలో తాను పరుషంగా మాట్లాడానని చెబుతున్న బొత్స చెబుతున్నా.. దీనికి ఆధారాలను చూపించాలని అన్నారు. తాను ఎప్పుడూ ఎవరినీ దూషించలేదని నారా లోకేష్ తెలిపారు. బొత్స సీనియర్ నాయకుడని, తాను ఎప్పుడూ గౌరవిస్తానని మంత్రి చెప్పారు.

# వర్షంపైనా జీఎస్‌టీ! కొత్త పంథా అనుసరిస్తున్న కేంద్ర ప్రభుత్వం




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23: స్విగ్గీ, జొమాటో వంటి ఆన్‌లైన్ ఫుడ్ ప్లాట్‌ఫామ్‌లు డెలివరీ ఫీజు కింద 18 శాతం కొత్తగా జీఎస్‌టీ వసూలు చేయడం మొదలుపెట్టడంతో కొత్త జీఎస్‌టీ రేట్లు అమలులోకి రావడానికి ముందుతో పోలిస్తే వినియోగదారులకు ఆర్థిక భారం పెరిగింది. అయితే వర్షం వచ్చినపుడు ఫుడ్ డెలివరీ చేయాల్సి వస్తే వర్షం ఫీజు కింద రూ. 25తోపాటు అదనంగా 18 శాతం జీఎస్‌టీ వసూలు చేయడం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇక సూర్యకాంతి సౌకర్యం ఫీజు, ఆక్సిజన్ కాపాడుతున్నందుకు ఫీజు, గాలి పీలుస్తున్నందుకు ఫీజు వంటివి వడ్డించడమే తరువాయని నెటిజన్లు కేంద్రానికి చురకలు అంటించారు. ఓ నెటిజన్ తాను ఆన్‌లైన్‌లో తెప్పించుకున్న ఫుడ్ బిల్లు స్క్రీన్‌షాట్ పోస్టు చేశాడు. అందులో రెస్టారెంట్ జీఎస్‌టీ 14.75, డెలివరీ రెయిన్(వర్షం) ఫీజు రూ.25 ప్లస్ రూ. 4.50 జీఎస్‌టీ, రెస్టారెంట్ ప్యాకేజింగ్ రూ.20, ప్లాట్‌ఫామ్ ఫీజు రూ.14.99 అని ఉన్నాయి. అయితే వర్షం ఫీజుపైనే నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ఇక వర్షంలో వచ్చే ఆర్డర్‌కు రూ. 25 అదనంగా కట్టాల్సిందేనంటూ పలువురు నెటిజన్లు వాపోయారు. కొందరు మాత్రం వర్షంలో ఫుడ్ డెలివరీ చేసినందుకు ఆమాత్రం ఫీజు అదనంగా చెల్లిస్తే నష్టమేమీ లేదంటూ కొందరు సానుకూలత వ్యక్తం చేశారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com